శుక్రవారం
16-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 86
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కార్మికోద్యమంలోంచి కమ్యూనిజంలోకి

చరిత్ర సృష్టించిన రైతు రక్షణ యాత్ర

7లో

రాజ్యాంగానికి మోదీ తూట్లు

- లౌకికవాదానికి ప్రమాదం
- జాతీయ మహాసభల్లో దేశ రాజకీయ పరిణామాలపై చర్చ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డి, రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో– న్యూఢిల్లీ: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోందని, లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 14–18 తేదీల్లో విజయవాడలో జరగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో దేశ రాజకీయ పరిణామాలపై చర్చించబోతున్నామని తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశానికి సీపీఐ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నేతలు హాజరయ్యారు. అనంతరం మీడియాతో రామకృష్ణ మాట్లాడుతూ, ఈ కార్యవర్గ సమావేశంలో జాతీయ మహాసభలకు సంబంధించిన అంశాలపై చర్చించామని చెప్పారు. దేశంలో రాజకీయాలు ప్రమాదకరంగా తయారయ్యాయనీ, ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా చేస్తున్నారన్నారు. విజయవాడలో జరిగే పార్టీ జాతీయ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి సీపీఐ నాయకులు ప్రతినిధులుగా పాల్గొంటారని వివరించారు. 20 దేశాల నుంచి కమ్యూనిస్టు, వర్కర్స్, సోషలిస్ట్ పార్టీల నాయకులు సౌహార్ద్ర ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. మహాసభల ప్రారంభరోజైన అక్టోబర్ 14 తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. 15వ తేదీ ప్రారంభ సభకు సీపీఐ నేతలతో పాటు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ (ఎంఎల్), ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు హాజరై సౌహార్ద్ర సందేశాలిస్తారని వివరించారు. 16,17 తేదీల్లో రాజ్యాంగం, ప్రజాస్వామ్య అంశాలపై సెమినార్ జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సెక్యులర్, ప్రజా తంత్ర పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు సదస్సుకు హాజరవుతారన్నారు. తమిళనాడు, కేరళ, బీహార్ ముఖ్యమంత్రులు స్టాలిన్, పినరయి విజయన్, నితీశ్ కుమార్ హాజరవుతారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్‌ను కూడా ఈ సెమినార్‌కు ఆహ్వానిస్తామన్నారు.

అప్పుడు ఎందుకు చర్చించలేదు?: రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి మూడు రాజధానుల బిల్లు పెట్టినప్పుడు అసెంబ్లీలో ఎందుకు చర్చ పెట్టలేదని ముఖ్యమంత్రి జగన్‌ను రామకృష్ణ ప్రశ్నించారు. 60 రోజుల రైతుల పాదయాత్రపై విమర్శలు చేయడం సరికాదని, బెంజికార్ల వాళ్లు పాదయాత్ర చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అమరావతి రాజధానిగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, ఇతర సమస్యలను పక్కన పెట్టి, అసెంబ్లీని కబ్జా చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర చేస్తున్న వాళ్లకు అండగా ఉంటామని పునరుద్ఘాటించారు.

నిర్దిష్ట తీర్మానం: చాడ వెంకటరెడ్డి

సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాయకులు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, సీపీఐ జాతీయ మహాసభల్లో దేశానికి దశ దిశ

- మిగతా 2 లో

జాబ్ క్యాలెండర్ జాడేది?

- చర్చకు ప్రతిపక్ష సభ్యుల పట్టు
- ఆందోళనతో ఉభయ సభలు వాయిదా
- వికేంద్రీకరణ చర్చపై నిరసన
- టీడీపీ సభ్యులపై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే రసాభాస చోటు చేసుకుంది. జాబ్ క్యాలెండర్‌పై చర్చకు టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని అసెంబ్లీలో స్పీకర్, శాసనమండలిలో చైర్మన్ తిరస్కరించారు. దీంతో ఉభయసభల్లో ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టి చర్చకు పట్టుబట్టారు. వాయిదా తీర్మానంపై చర్చ చేపట్టాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. 'జాబ్ ఎక్కడ జగన్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నిరుద్యోగులను మోసం చేసిన జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్‌గా మారిందని, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దీనిపై చర్చకు అంగీకరించాలన్నారు. ఇది సరైన విధానం కాదని, ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానాన్ని చేపడతామని స్పీకర్ చెప్పినప్పటికీ టీడీపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గలేదు. అసెంబ్లీ వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. దీనిపై శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రతిపక్ష సభ్యులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల్లో టీడీపీ సభ్యుల ప్రశ్నలే ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. సభ జరగనివ్వకుండా ఉండాలన్న ధోరణితోనే టీడీపీ సభ్యులు రాద్ధాంతం చేస్తున్నారని, ప్లకార్డులతో సభలోకి రావడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ సభ్యుల ఆందోళనల మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలు కొనసాగిస్తుండగా, ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టి బిగ్గరగా నినాదాలు చేస్తూ, లక్షలాది మంది నిరుద్యోగులకు సంబంధించిన అతి ముఖ్యమైన ఈ సమస్యపై ఇప్పుడు చర్చ ప్రారంభించాలని పట్టుబట్టారు. వాయిదా తీర్మానం తిరస్కరించిన తర్వాత చర్చకు అవకాశం లేదని, స్పీకర్ పదే పదే నచ్చజెప్పాలని ప్రయత్నించినా వారు ఆందోళన విరమించలేదు. ఈలోపు దీనిపై మంత్రి మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు జోక్యం చేసుకుంటూ చంద్రబాబు రాకుండా వీరిని గొడవ చేయడం కోసమే సభకు పంపారంటూ విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే అన్ని విషయాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు చర్చకు రాకుండా ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఏసీ జరగకుండానే గొడవ ప్రారంభించారని, వాస్తవానికి టీడీపీకి అడగడానికి సబ్జెక్టులు కూడా లేవన్నారు. కేవలం సభను పక్కదారి పట్టించేందుకే సభను అడ్డుకోవాలని చూస్తున్నారని, ప్రతిపక్షం దురుద్దేశపూరిత ప్రయత్నాలను విరమించుకుని, సభా నిర్వహణకు సహకరించాలని హితవు

- మిగతా 2 లో

పుతిన్‌పై హత్యాయత్నం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగినట్లు తెలుస్తోంది.ఆయన ప్రయాణిస్తున్న కారుపై బాంబుదాడి జరిగినట్లు సమాచారం. అయితే ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బైటపడినట్లు జీవీఆర్ టెలిగ్రామ్ ఛానల్ వెల్లడించింది.

2లో

మేం వస్తే ప్రత్యేకహోదా

- నిర్లజ్జగా బీజేపీ ఫిరాయింపులు
- బెగుసరాయ్‌లో హింసకు కుట్ర
నితీశ్



పాట్నా: కేంద్రంలో బీజేపీ యేతర ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన రాష్ట్రాలన్నింటికీ ప్రత్యేకహోదా ఇస్తామని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ హామీ ఇచ్చారు. బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని సుదీర్ఘకాలంగా నితీశ్ డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌డీఏ నుంచి బయటికి వచ్చిన తర్వాత నితీశ్ ప్రతిపక్షాలన్నింటికీ ఏకతాటిపైకి తీసుకురావడానికి విశ్వప్రయత్నం చేస్తున్న విషయం విదితమే. నితీశ్‌కుమార్ ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు సానుకూలంగా సమాధానాలు చెప్పారు. 'కేంద్రంలో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం మాకు లభిస్తే వెనుకబడిన రాష్ట్రాలన్నింటికీ ప్రత్యేక కేటగిరీ హోదా ఇస్తాం. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడానికి ప్రత్యేకించి కారణాలేమీ లేవు' అని నితీశ్ చెప్పారు. 'బీహార్ నుంచి జార్ఖండ్ రాష్ట్రాన్ని విభజించడం కారణంగా రెవెన్యూలోటు ఏర్పడింది. ఖనిజ సంపద జార్ఖండ్‌కు వెళ్లింది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రం నడుస్తోంది. బీహార్‌కు ప్రత్యేక డిమాండ్‌ను నెరవేర్చుకోవడానికి కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి మద్దతిచ్చాను' అని నితీశ్ వివరించారు. గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేయడంపై నితీశ్ ఆగ్రహం వెలిబుచ్చారు. 'ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎవరు లాక్కుంటున్నారో అందరికీ తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల్లో పెద్దఎత్తున చేతులు మారినట్లు ఆరోపించారు. సుదీర్ఘకాలం బీజేపీతో కలిసి ప్రయాణం చేయడం పెద్దపొరపాటని నితీశ్ అంగీకరించారు. తనపై బీజేపీ నాయకులు బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడంతో కాషాయపార్టీ బుద్ధి ఏమిటో తెలుసుకున్నానని చెప్పారు. ప్రధానమంత్రి ఇంటిపేరు ఉన్న బీజేపీ నేత సుశీల్ మోదీపై నితీశ్ నిప్పులు చెరిగారు. బెగుసరాయ్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పెద్దల నుంచి ఏదో ఆశించే రాష్ట్ర నాయకులు తనకు వ్యతిరేకంగా విమర్శలు చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అది వారిష్టమని వ్యాఖ్యానించారు. బెగుసరాయ్‌లో ప్రతినిమిషం ఏమిజరుగుంతో తనకు పూర్తి సమాచారం ఉందని చెప్పారు. ఈ ఘటనలో నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, కఠినంగా శిక్షిస్తామని నితీశ్ స్పష్టంచేశారు.

'గాలి' బెయిల్ రద్దు చేయండి: సీబీఐ

6లో

యూపీలో దారుణం

ఇద్దరు దళిత అక్కాచెల్లెళ్లపై అత్యాచారం - ఆరుగురి అరెస్టు

- యోగి సర్కార్‌పై ప్రతిపక్షాల ఆగ్రహం
- మహిళలకు రక్షణ ఏదని నిలదీత

న్యూఢిల్లీ: అత్యాచారాల కేంద్రంగా పేరొందిన ఉత్తరప్రదేశ్‌లో మరో ఘటన వెలుగు చూసింది. ఇద్దరు దళిత అక్కాచెల్లెళ్లు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇద్దరూ మైనర్లు కావడం, చెట్టుకు వేలాడుతూ విగతజీవులుగా కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. వీరు అత్యాచారం, హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరి జిల్లా నిఘాసన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ దళిత కుటుంబం నివాసముంటోంది. ఇంటికి కిలోమీటరు దూరంలో చెరకు చేనులోని ఓ చెట్టుకు అక్కాచెల్లెళ్ల మృతదేహాలు వేలాడుతూ కనిపించాయి.

పక్క గ్రామానికి చెందిన ముగ్గురు యువకులే తన ఇద్దరు బిడ్డలపై అత్యాచారానికి ఒడిగట్టి హత్య చేసినట్లు బాలికల తల్లి తెలిపారు. బైకులపై వచ్చి బాలికలను అపహరించి ఆపై అత్యాచారానికి పాల్పడి చంపేశారని చెప్పారు. మృతులను పూనమ్ (15), మనీషా (17)గా గుర్తించారు. మృతదేహాలను శవపరీక్షకు తరలించారు. వారి

- మిగతా 2 లో

ఇకపై 67 ఏళ్లకు రిటైర్మెంట్

సుప్రీం, హైకోర్టు జడ్జీల పదవీ విరమణ వయస్సు పెంపు: బీసీఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టు జడ్జీల పదవీ విరమణ వయస్సును 67 ఏళ్లకు పెంచుతూ భారత బార్ కౌన్సిల్ (బీసీఐ) నిర్ణయించింది. ప్రస్తుతం కిందిస్థాయి కోర్టు న్యాయాధికారులు, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 60, 62, 65 ఏళ్లకు పదవీ విరమణ పొందుతున్నారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును పెంచాలని బార్ నేతలు డిమాండు చేస్తున్నారు. ఈ క్రమంలో అన్ని రాష్ట్ర బార్ మండళ్లు, హైకోర్టు బార్ సమాఖ్యల ఆఫీసు బేరర్లు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఉత్సాహంగా పాదయాత్ర

- రైతులు, ప్రజల సంఘీభావం
- వేమూరులో ఘనస్వాగతం
- అమరావతి విచ్ఛిన్నానికి జగన్ కంకణం: నేతలు

విశాలాంధ్ర–వేమూరు: ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని పేరుతో అమరావతి పరిరక్షణ సమితి అధ్వర్యంలో మహిళలు, రైతులు, ఉద్యమకారులు చేపట్టిన మహాపాదయాత్ర గురువారం నాలుగో రోజు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో ప్రవేశించింది. పాదయాత్రకు వేమూరు నియోజకవర్గ రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పాదయాత్రీకుల అడుగులో అడుగు కలిపారు. ఉత్సాహంగా పాల్గొన్నారు. పాదయాత్ర అమర్తలూరు మండలం యడవూరు అడ్డరోడ్డు, జంపని, బూతుమల్లి అడ్డరోడ్డు మీదుగా వేమూరు చేరుకుంది. వేమూరులో భోజన విరామం అనంతరం కొల్లూరు వరకు కొనసాగింది. పాదయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల రైతులు రాజధాని రైతులకు సంఘీభావంగా నిలిచారు. కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, జనసేన, బీజేపీ శ్రేణులు అమరావతికి మద్దతునిస్తూ రైతులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. మహా పాదయాత్రకు లభిస్తున్న

- మిగతా 2 లో

రాజధానుల్లో అమరావతి ఒకటి

- అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- సచివాలయాలు, కొత్త జిల్లాలు, మూడు రాజధానులు అందుకే
- వికేంద్రీకరణపై చర్చలో సీఎం జగన్ స్పష్టీకరణ



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో అమరావతితో సహా అన్ని ప్రాంతాలు తనకు సమానమేనని, అందుకే పాలన, అభివృద్ధి వికేంద్రీకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో గురువారం వికేంద్రీకరణపై జరిగిన లఘు చర్చలో సీఎం సుదీర్ఘ ప్రసంగం చేశారు. చంద్రబాబు, ఆయన బృందం ఆలోచనలు పెత్తందారీ ధోరణితో ఉంటాయని, అందుకే కట్టని, కట్టలేని అమరావతి రాజధాని కోసం కృత్రిమ ఉద్యమం

- మిగతా 2 లో

అసెంబ్లీ ఎక్కడుంటే అదే రాజధాని కేంద్రమంత్రి నారాయణ స్వామి

2లో

సంపాదకీయం

భాష పేర చిచ్చు

భాష మానవజాతి సంస్కృతికి ఆనవాలు. ఇతర సాంస్కృతిక అంశాలు ఒక జాతిని నిర్వచించడానికి ఎలా ఉపయోగపడతాయో భాష కూడా అలాగే ఉపకరిస్తుంది. భాషను, సంస్కృతిని అణగ దొక్కితే ఉద్యమాలు చెలరేగడమే కాదు దేశాలే విడిపోయిన ఉదంతాలు మన పొరుగుననే ఉన్నాయి. మన దేశం భిన్న సంస్కృతులకు నిలయం. కనీసం ఆరు వందల భాషలు మాట్లాడే వారున్న వైవిధ్యం మన సొంతం. భిన్న భాషలు మాట్లాడే వారిని ఏకం చేయడం కోసమే కాక దేశమంతా ఒకే భాషలో పరిపాలన సులువుగా సాగడంకోసం జాతీయ భాష ఉండాలన్న ఆలోచన కూడా స్వాతంత్రోద్యమ కాలంలోనే ఉంది. అయితే ప్రాంతీయ భాషలను ప్రోత్సహించాలన్న సదుద్దేశమూ జాతీయోద్యమ నాయకులకు ఉండేది. హిందీకి అధికార భాష ముద్ర వేయాలని గతంలోనూ ప్రయత్నాలు జరిగాయి. తమిళనాడులో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. ఉద్యమం రక్తసిక్తమైంది. 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ నిర్ణాయక సభలో హిందీ అధికార భాషగా ఉండాలన్న ప్రతిపాదన వచ్చింది. దేశంలో హిందీని అధికార భాషగా చేయాలని రాజేంద్ర సిన్హా అవిశ్రాంత పోరాటం చేశారు. ఆయన జన్మదినం సెప్టెంబర్ 14. అందుకోసమే ఆ రోజును హిందీ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆ సందర్భాన్ని ఉపయోగించుకుని హిందీని అందరి మీదా రుద్దడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి ప్రయత్నిస్తున్నారు. మన దేశంలో హిందీ మాట్లాడే రాష్ట్రాలు సంఖ్యాపరంగా ఎక్కువే. నేపాల్, గయానా, ట్రినిడాడ్, టొబాగో, సురినాం, ఫిజీ, మారిషస్‌లో హిందీ మాట్లాడే వారు ఉన్నారు. అయితే హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకించే వారు దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఉన్నారు. హిందీని రుద్దే ప్రయత్నం దేశ ఐక్యతను దెబ్బ తీస్తుంది. దక్షిణాది రాష్ట్రాలకు హిందీతో అంత సాన్నిహిత్యమూ లేదు. మమకారం అంతకన్నా లేదు. హిందీని అధికార భాషగా చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు తెలుగు ప్రాంతాలలో కూడా ప్రత్యేకంగా హిందీ నేర్చుకున్న వారు ఉన్నారు. ఇది ఉద్యోగావకాశాలకోసం అయి ఉంటుంది. అవసరం లేనిదే ఎవరూ ఏ భాషా నేర్చుకోరు. భాషల్లో సుసంపన్నమైనవి ఉండొచ్చు. అంతమాత్రం చేత ఫలానిది గొప్ప భాష అని చెప్పడానికి వీలు లేదు. హిందీ ప్రాంతీయ భాషలకు మిత్ర భాషే తప్ప శత్రు భాష కాదని టీకా టిప్పణీ చేయడానికి కూడా అమిత్ షా సాహసించారు. దేశ జనాభాలో 70 శాతం మంది హిందీ అర్థం చేసుకోగలరు. ఎక్కువ మంది ఆ భాష మాట్లాడడమూ నిజమే. ఎక్కువ రాష్ట్రాల్లో ఆ భాష మాట్లాడే వారు ఉన్నప్పుడు ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ హిందీ తెలిసినా, ఒక భాషగా అనేకానేక కారణాలవల్ల దాన్ని నేర్చుకుని, అధ్యయనం చేసే వారు ఉన్నా వారందరూ హిందీని అక్కున చేర్చుకుంటారన్న హామీ ఏమీ లేదు. అసలు హిందీ అన్న మాటే పర్షియన్ భాష నుంచి పుట్టింది. అమీర్ ఖుస్రో మొట్ట మొదట హిందీ కవిత్వం రాశారంటారు. 1977లో అప్పటి విదేశాంగ మంత్రి అటల్ బిహారీ వాజపేయి ఐక్యరాజ్య సమితి సార్వత్రిక సభలో హిందీలో మాట్లాడిన మాటా నిజమే. ఐక్యరాజ్య సమితిలోనే కాదు మన పార్లమెంటులోనూ వివిధ భాషల్లో మాట్లాడే వారు ఉన్నారు. మిగతా భాషలు మాట్లాడే వారు తమ భాష కాని భాషలో ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు అర్థం చేసుకోవడానికి తక్షణం అనువదించే సదుపాయం పార్లమెంటులో ఉంది. హిందీ అత్యంత ప్రాచీనమైన భాష అని అమిత్ షా దబాయిస్తున్నారు. ప్రాచీన భాష అయితే విశ్వవిద్యాలయాల్లో దాన్ని ఆధునిక భాషల జాబితాలో ఎందుకు చేర్చినట్టు? తెలుగు కూడా ఆధునిక భాషల జాబితాలోనే ఉండేది. తెలుగు వారు పోరాడి ప్రాచీన భాష హోదా సాధించారు. దానివల్ల తెలుగు ఎంత అభివృద్ధి చెందిందో చెప్పడానికి కొలమానాలు ఏమీ లేవు.

1950 జనవరి 26న అమలులోకి వచ్చిన మన రాజ్యాంగం రాయడానికి వినియోగించిన భాష ఇంగ్లీషు తప్ప హిందీ కాదు. రాజ్యాంగ అధికారిక అనువాదం హిందీలో కూడా అందుబాటులో ఉంది. కానీ ఏ అంశం గురించి అయినా అనుమానం వచ్చినప్పుడు ఇంగ్లీషు ప్రతే ప్రామాణికం అన్నారు. ఇదంతా జరిగిన 14 ఏళ్లకు గానీ అమిత్ షా జన్మించలేదు. కానీ హిందీయే అధికార భాష అంటున్నారు. రాజ్యాంగంలోని 343వ అధికరణం హిందీని అధికార భాషగా గుర్తించిన మాటా వాస్తవమే కావచ్చు. హిందీని అధికార భాషగా మార్చడానికి పెట్టుకున్న గడువు పూర్తి అయినప్పటికీ అది సాధ్యం కాలేదు. అందువల్ల అవసరమైనన్నాళ్లు ఇంగ్లీషు వాడొచ్చునన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వ వ్యవహారాలు ప్రధానంగా ఇంగ్లీషులోనే సాగుతాయి. హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో "రోజుకో హిందీ మాట నేర్చుకుందాం" అని ఒక బోర్డు మీద ఒక హిందీ మాట రాస్తుంటారు. దీనివల్ల హిందీ ఎంతమంది ఏ మేరకు నేర్చుకున్నారో తెలియదు. హిందీవల్ల ప్రాంతీయ భాషలూ పరిపుష్టమవుతాయని అమిత్ షా చెప్తున్నారు. ప్రతి భాష ఏదో ఒక భాషా కుటుంబానికి చెందింది అయి ఉంటుందనీ, ఇండో ఆర్యన్ భాషలకు, ఇండో యూరొపియన్ భాషలకు సకల విషయాల్లోను ద్రావిడ భాషకు పొత్తు కుదరదని అమిత్ షాకు తెలుస్తుందనుకోవడం పొరపాటే. మతపరమైన చీలికలే కాకుండా భాషా పరంగానూ జనాన్ని చీల్చాలన్న ప్రయత్నం అమిత్ షా మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఒక భాషను ప్రోత్సహించడానికి చేసే ప్రయత్నం ఆ భాష మీద ద్వేషం పెరిగేలా ఉండకూడదు. హిందీని అను సంధాన భాష అనడానికీ అధికార భాష అనడానికీ చాలా తేడా ఉంటుంది. అమిత్ షా అధికార భాష అంటున్నారు. ఏ భాష మాట్లాడే వారికి ఆ భాష సుందరమైందే. ఆ సౌందర్యాన్ని ఇతర భాషలు మాట్లాడే వారూ మెచ్చుకోవాలనడం కుదరదు. అది వారికి అనవసరం కూడా కావచ్చు. ఇండియాను హిందియాగా మార్చకండి అని తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ అప్పుడే హెచ్చరించారు. తమిళులు, మల యాళీలు, కన్నడిగులు, తెలుగు వారి మీద హిందీని రుద్దాలని ప్రయత్నించడం తంపులు పెట్టడానికి మాత్రమే ఉపయోగ పడ్తుంది. హిందీతో సంబంధం లేని వారికి హిందీ కచ్చితంగా పరాయి భాషే. హిందీ కాకుండా ఇతర భాషలు మాట్లాడే వారిమీద హిందీ రుద్ది అవమానించే హక్కు అమిత్ షాకు లేదు. మోదీ, అమిత్ షా ద్వయం తమ స్వరాష్ట్రంలో గుజరాతీ మాట్లాడే వారి చేత హిందీ చేదు గుళిక మింగించ లేరుగా! భాషా దురహంకారం మత దురహంకారానికన్నా తక్కువేమీ కాదు. అయినా మోదీ, అమిత్ షా మాతృ భాష హిందీ కాదుగా!

ప్రశ్నించడమే నేరమా!

రా బావా ఏంటి ఆలోచిస్తూ గొణుక్కుంటూ వస్తున్నావు. పార్వతి మీ అన్నయ్య వచ్చాడు మరో కాఫీ పట్టుకురా. ఏంలేదు బావా మొన్న మా మనవడు స్కూల్లో ప్రశ్నించాడని టీచరు ఇరగ్గొట్టిందనుకో. అదేంటి బావా తెలియనపుడు ప్రశ్న వేసి అడిగి తెలుసుకోవాలి కదా. కొట్టడమేంటి యింతకు ఏమని ప్రశ్నించాడు బావా. ఏంలేదు బావా కృష్ణాంజనేయ యుద్ధం గురించి చెబుతోందట. మా వాడు రామావతారం తరువాత కృష్ణావతారం కదా. ఆంజనేయుడు రాముని భక్తుడే కదా. అలాంటపుడు కృష్ణుడు ఆంజనేయునిపై ఎందుకు యుద్ధం చేస్తాడని అడిగాడు. దాంతో కోపమొచ్చిన టీచరు చెప్పింది వినాలిగాని వెధవ ప్రశ్నలు వేయకూడదని చెంపలు వాయించేసింది. అదేమిటి టీచరు అడగడం తప్పా. మీ అబ్బాయి డబ్బులు అడిగితే దేనికని మీరడగరా కొడతారా? అన్నాడట బావా. దాంతో ఉగ్రరూపం దాల్చి వీపు వాచిపోయేలా కొట్టింది బావ.

అదా సంగతి బావ అసలు ప్రశ్నించడం మానేయడం వల్లే దేశానికి ఈ గతి పట్టింది. పై నుంచి కింద వరకు విని ఆచరించడమే తప్ప ప్రశ్నించ వద్దంటులన్నారు బావ. అందుకే బావా పిల్లలు పెద్దవాళ్లు ఏం చేయమంటే అదే చేస్తున్నారు. దేనికి ఎందుకు అని అడగడం మానివేశారు. ఈ పద్ధతి మతస్థులకు, నాయకులకు ఉపయోగం బావ. అడగకుండా చెప్పింది చేస్తారు. అది నిజమే. అలాంటప్పుడు పిల్లల మెదడుకు పని ఉండదు. ఆలోచించకుండా ఆచరిస్తారు. పిల్లలు, యువకులు అలా అలవాటుడితే



అభ్యుదయం, ప్రగతి శూన్యం కద బావ. నిజమే బావ. అందుకే త్రిపురనేని గోపీచందు తండ్రి రామస్వామిచౌదరి ప్రశ్నించడం నేర్పారు. అందుకే గోపీచందు తన నవల తండ్రికి అంకితం ఇస్తూ ఏమిటి, ఎందుకు అన్న ప్రశ్నలు వేయడం నేర్పినందుకు అన్నారు.

కాని బావ ప్రస్తుతం రాజకీయాల్లో కూడ కింద నుండి పై వరకు నాయకులు చెప్పింది విని ఆచరించడం తప్ప ఎందుకని ప్రశ్నించడం లేదు. ఈ విధంగా తరవాత మూఢ భక్తులుగా తయారవుతున్నారు. ఇలాగే కొనసాగితే పై నాయకుల దోపిడీకి అంతం ఉండదు. అపుడు ప్రగతి శూన్యం. అది నిజమే బావ ముఖ్యంగా రాజకీయాల్లో ప్రవేశించే యువతకు ప్రశ్నించడం తెలుసుకోవడం నేర్పకపోతే సమాజం తీవ్రంగా నష్టపోతుంది. అది నిజమే బావ. నాయకులు అందుకు అంగీకరించరు. చిన్న చిన్న పదవులు పొందడం తద్వారా పేదల నుండి డబ్బులు వసూలు చేయడానికి అలవాటుపడ్డ కింద క్యాడరు ప్రశ్నిస్తే వచ్చేదేమిటి అని సరిపెట్టుకుంటున్నారు. ఇక మత విష సంస్కృతి కూడ అలాగే యువతను పక్కదారి పట్టించి దేవుని ఆజ్ఞగా భావించి మత పెద్దలు చెప్పింది తూచ తప్పకుండ ఆచరిస్తున్నారు. తద్వారా ఈ ఆలోచించి జ్ఞానాన్ని పొందవలసిన యువత అజ్ఞానాంధకారంలో కొట్టుకుపోతున్నారు.

నిజమే దేశ ప్రగతి యువత మీదే ఆధారపడి ఉందని మేధావులంటున్నారు గద. పిచ్చి బావ సమాజాన్ని జాగృతపరిచే మేధావులను, అభ్యుదయ రచయితలను ఒక కిరాయి రౌడి హతమారుస్తున్నాడు. అలాగే సంఘ సంస్కర్తలను బలి తీసుకుంటున్నారు. ఇంతెందుకు మనం జాతిపితగా పిల్చుకునే మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను దేశ భక్తునిగా పరిగణించి బీజేపీ, హిందూత్వవాదుల ఏలికలో ఉన్న మన దేశం గురించి ఆలోచిస్తే గుండె బరువెక్కక మానదు బావ. అది సరే బావ దేశంలో తాము పరిష్కరించాల్సిన ప్రజా సమస్యలేమీ లేనట్లు పాదయాత్ర చేసే రాహుల్ గాంధీ టీషర్టు గురించి బీజేపీ చేసే ఆరోపణలు చూస్తే నవ్వాలో ఏడ్వాలో తెలియడం లేదు బావ. నిజమే బావ రానురాను నాయకులు ఛీప్ పాలిటిక్సుకు అలవాటుపడుతున్నారు. ప్రధాని వేసుకునే బట్టల గురించి కాంగ్రెసు వారు, రాహుల్ టీషర్టు గురించి బీజేపీ వారు. యివేమి రాజకీయాలో అర్థం కావడం లేదు బావ. అర్థం కానిదేముంది బావ. దేశాన్ని కుదిపేసే సమస్యలను పక్కదోవ పట్టించడానికి యిలాంటి కామెంట్లు బయటకొస్తాయి బావ.

రైతు యాత్ర వల్ల అల్లర్లు జరిగే ప్రమాదముంది కద బావ. జరగవచ్చు అధికార పార్టీ అణచివేసే ప్రయత్నం చేస్తే తద్వారా లబ్ధి పొందే ఆలోచన ప్రతిపక్షాలది. ఏ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా ఇలాగే ఆలోచిస్తుంది తప్ప రాష్ట్ర శ్రేయస్సు గూర్చి ఆలోచించడం లేదు. అల్లర్ల ద్వారా లబ్ధి పొందాలనే ఆలోచన సమంజసం కాదు బావా. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందటం మంచిదే కాని వేల కోట్లు ఖర్చుచేసి కట్టిన భవనాలు నిరుపయోగంగా పడి ఉండటం మంచిది కాదు. పైగా అసెంబ్లీలో జగన్ కూడ ఆనాడు సమ్మతి తెలిపాడు కద బావ. నిజమే కాని అమరావతిని ప్రపంచంలోనే ఒక పెద్ద నగరంగా నిర్మించి అక్కడ నుండి వచ్చే ఆదాయంతో రాష్ట్రం అభివృద్ధి చేయవచ్చని, 2050 నుండి అక్కడ సంపద మొదలవుతుందని చంద్రబాబు అంటున్నారు. కాని అసలు ఆయన ఊహించిన విధంగా నిర్మించడానికి నిధులు ఎక్కడ నుండి వస్తాయని మేధావులు ప్రశ్నిస్తున్నారు. కాని ఈ విషయంలో కూడ ప్రశ్నించడం మాని నాయకులు చెప్పేవి విని ఊరుకోవాలి బావ. నిజమే బావ అసలు ప్రశ్నించడం మాని ఉన్న దాంతో సరిపెట్టుకొని జీవనం సాగించడం మంచిదన్నట్లుగ రాజకీయాలు నడుస్తున్నవి కద బావ.

తెలంగాణ సాయుధ పోరాటం ఎందుకు జరిగింది?

డా॥ కె.నారాయణ

ఒకప్పుడు హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోయింది. క్రూరమైన కట్టు బానిసత్వంతో ప్రజలు జీవచ్ఛవాలుగా ఉన్న రోజులవి. దీనికి తోడు స్థానికంగా ఎక్కడికక్కడ భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దుర్మార్గాలకు అంతూపంతూ ఉండేది కాదు. నిజాం ప్రైవేటు సైన్యం రజాకార్లు పట్టపగలే గ్రామాల మీద పడి దోచుకునే వారు. మహిళలకు భద్రత అన్నదే లేదు. కట్టు బానిసత్వం తరతరాలూ కొనసాగింది. తెలుగు మాట్లాడే ప్రజలందరి మీదా ఉర్దూని బలవంతంగా రుద్దారు. ఉర్దూ అధికార భాషగా ఉండేది. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు తిరగబడడానికి, పోరాటానికి దిగడానికి ఇది కూడా ఒక కారణం. రుణాల పేరుతో తరచూ పేద రైతుల భూములను ఆక్రమించుకునే వారు. రజాకార్లు, స్థానిక భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు కలిసి పంటలు, వ్యవసాయ ఉత్పత్తులను దోచుకుపోయేవారు. చిన్న వ్యాపారులూ సరుకులను కిమ్మనకుండా రజాకార్లకు అప్పగించాల్సిన దుస్థితి నెలకొన్న రోజులవి. మేకలు, కోళ్ళు, ధాన్యం ఇలా ఏది కావాలంటే అది బలవంతంగా లాక్కొనేవారు. ఈ అరాచకాలను భరించలేని అన్ని వర్గాల ప్రజలు తిరగబడడం ప్రారంభించారు. సంఘం (యూనియన్) లో చేరారు. ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి చరిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. దీంతో హైదరాబాద్ రాష్ట్రాన్ని నిజాం స్వతంత్ర రాష్ట్రంగా ప్రకటించాడు. స్వతంత్ర దేశంగా గుర్తించాలంటూ ఐక్యరాజ్యసమితికి నిజాం దరఖాస్తు కూడా పంపించాడు. ఇలాంటి పరిస్థితుల్లో నిజాం, బ్రిటిషర్ల బందిఖానా నుండి తెలంగాణకు స్వేచ్ఛ కోసం అన్ని జీవన రంగాల ప్రజలు ఉప్పెనలా కదలివచ్చారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అణచివేతే ఈ తిరుగుబాటునకు ప్రధానమైన మూల కారణం. బహిరంగంగా సభలు, సమావేశాలు జరుపుకునేందుకు ప్రజలను అనుమతించలేదు. ప్రజావాణిని తొక్కిపెట్టారు.

ఈ చరిత్రను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు వక్రీకరిస్తున్నాయి. దీనిని ముస్లిం రాజు–హిందూ ప్రజల మధ్య జరిగిన పోరాటంగా కపట ప్రచారం చేస్తున్నాయి. వారు చెబుతున్నదే నిజమైతే.. హైదరాబాద్‌లో ప్రముఖ జర్నలిస్టు షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు ఎందుకు చంపారు? ఈ సాయుధ పోరాటంలో తొలి అమరుడు బందగీ రజాకార్ల బుల్లెట్లకు ఎందుకు బలైపోయాడు? అతనూ ముస్లిమే కదా! ఈ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురిలో ఒకరైన మఖ్దూం మొహియుద్దీన్ ముస్లిం. అనేకమంది దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాములు హిందువులు. వారు హిందువులనే వేధించారు. ఎంతోమంది హిందు మహిళలను పీడించారు. ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర లాంటి వివిధ ప్రాంతాల నుండి హిందు, ముస్లింలు ఈ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఇది హిందువులు, ముస్లిం రాజు మధ్య జరిగిన పోరాటంగా బీజేపీ చేస్తున్న వాదన అర్థం లేనిది. ఈ పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారు.

ఈ పోరాట ఫలితంగా 20 లక్షల ఎకరాల భూమిని భూమిలేని వారికి పంచారు.

నిజాం నిరకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను అల్పం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ పోరాటంలో పాల్గొన్న వేలాదిమంది స్వాతంత్ర్య సమర యోధులు పెన్షన్లు తీసుకున్నారు, తీసుకుంటున్నారు. నిజాంకి వ్యతిరేకంగా జరిగిన పాల్గొన్న తమ నాయకుడిని ఒక్కడినైనా బీజేపీ లేదా ఆర్‌ఎస్‌ఎస్ చూపించగలవా? అప్పటికి ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ మాత్రమే ఉన్నాయి. సాయుధ పోరాటంలోగానీ, స్వాతంత్ర్య పోరాటంలోగానీ వారు ఎవ్వరూ పాల్గొనలేదు. ఇక్కడ అసలు విషయమేమంటే.. వారు ఎప్పుడూ నాథూరాం గాడ్సే, సావర్కర్‌లను గొప్పగా చూపించే ప్రయత్నం చేస్తుంటారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కోట్లాదిమంది భారతీయులను కదిలించిన మహాత్మా గాంధీని గాడ్సే పొట్టనపెట్టుకున్నాడు. సావర్కర్ బ్రిటిష్‌వారిని క్షమాభిక్ష వేడుకుని జైలు నుండి విడుదల అయ్యాడు. అపకీర్తిని మూటగట్టుకున్న ఇలాంటి నాయకులను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు ఆరాధిస్తుంటారు, వారి భజన చేస్తుంటారు. నిజానికి వారు దేశద్రోహులు.

కమ్యూనిస్టులమైనప్పటికీ ప్రతి స్వాతంత్ర్య దినోత్సవాన మన పార్టీ కార్యాలయాలపై త్రివర్ణ జాతీయ పతాకాలను ఎగరేస్తున్నాం. ఈ 75 ఏళ్ళల్లో ఏనాడైనా వారి ప్రధాన కేంద్రం నాగపూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగరేశారా? తెలంగాణ విముక్తి సంబరాల వారోత్సవాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కర్నాటక, మహారాష్ట్ర ముఖ్యమంత్రులతో కలిసి తెలంగాణకు వస్తున్నారు. నిజంగా ఆయన ఇందుకోసమే వస్తున్నారా? లేక మునుగోడు ఉప ఎన్నికల కోసం బ్రీఫ్ కేసులతో వస్తున్నారా? బహుశా ఆయన కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బేరసారాల పని పెట్టుకుని వస్తున్నారేమో? ఈ సమావేశాల్లో ఆయన పాల్గొనే ఉద్దేశం మాత్రం తెలంగాణ సాయుధ పోరాట గొప్ప చరిత్రను వక్రీకరించడమే.

సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ, అల్లూరి సీతారామరాజు లాంటి స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాట నాయకులైన రావి నారాయణ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్యలను మాత్రం ఆయన కావాలనే మర్చిపోయారు. మన తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కంటే రావి నారాయణ రెడ్డి ఎక్కువ ఓట్లు సాధించారని చెప్పడం ఇక్కడ అసందర్భమేమీ కాదు. పార్లమెంట్ భవనంలో అడుగు పెట్టగానే రావి నారాయణ రెడ్డి స్థానం మిగతా అందరికంటే ముందుండాలని, ఆనాడు పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించే సమయంలో నెహ్రూ తన సహచరులు, అధికారులతో స్వయంగా చెప్పారు. లోక్‌సభలో రావి నారాయణ రెడ్డి, రాజ్యసభలో తొలి ప్రతిపక్ష నాయకుడు సుందరయ్యల నిలువెత్తు విగ్రహాలను పార్లమెంట్ భవనాల వసారాల్లో ఏర్పాటు చేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా వారం రోజుల పాటు సంబరాలు చేస్తామని కేసీఆర్ ఎన్నికల ముందు హామీనిచ్చారు. తర్వాత ఆయన ఈ విషయమే మర్చిపోయారు. ఒకసారి ఆయన నిజాంను కీర్తించారు కూడా. ఈ నిజాం సైన్యం రజాకార్లు ఎంతోమంది మహిళలను వారి భర్తల ఎదుటే వేధించారు. ఎంతోమంది అమాయకులను బాధించారు, వేదనకు గురిచేశారు. అలాంటి నిజాంను కేసీఆర్ పొగిడారు. స్వాతంత్ర్య సమర యోధుల దగ్గర ఆయన ఈ మాటలు అని ఉంటే తీవ్ర విమర్శలను ఎదుర్కొనేవారు. ఇప్పుడు ఈ వారమంతా జాతీయ సమగ్రతా దినంగా పాటించనున్నట్లు కేసీఆర్ కొత్త రాగం అందుకున్నారు. ఇందుకు కారణం మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమాన్. ఆయన ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎంఐఎం నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్లేటు మార్చారు. ఆయన బీజేపీకి వ్యతిరేకంగా ఉంటే ఎంఐఎం ఖచ్చితంగా టీఆర్‌ఎస్‌కు పూర్తి మద్దతునిస్తుంది. కేసీఆర్‌కు ఏ మాత్రం ఆందోళన అవసరం లేదు. మతతత్వ, మతోన్మాద ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పురోగామి ముస్లింలు, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఖచ్చితంగా కేసీఆర్‌కు మద్దతుగా నిలుస్తాయి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లేదా నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎలాంటి పాత్రా లేని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌లు చరిత్ర తెలుసుకోకుండా ఇష్టానుసారం బడాబడా వాగుతున్నాయి. నిజానికి అవి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు కీలుబొమ్మల్లా పనిచేసాయి. "ఓటి కుండకు శబ్దమెక్కువ" అన్న సామెత సావర్కర్, గాడ్సే వారి గణానికి సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ అంటే హుజూరాబాద్ ఒక్కటే కాదు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు పడిపోవడం ప్రారంభమైంది. ఇక మిగిలింది ఒక్కటే.. మోదీ సూట్ కేసు సర్దుకుని తన సొంత రాష్ట్రం గుజరాత్‌కి వెళ్ళడమే. ఇంతవరకూ జరిగింది చాలు. ఇక సహించేది లేదు.

వ్యాస రచయిత సీపీఐ జాతీయ కార్యదర్శి
9490952222

ఐ-మెయిల్

ధరల క్రింద నలిగిపోతున్న ప్రజలు

దేశంలో ద్రవ్యోల్బణం పైపైకే చూస్తోంది. చిల్లర ధరల సూచీ ప్రకారం గణించే ద్రవ్యోల్బణం రేటు ప్రస్తుతం 7 శాతంగా ఉంది. నిత్యావసరాల ధరల బట్టీ గణించే ఈ సూచీ ద్వారా తిండి గింజల ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోవచ్చు. ద్రవ్యోల్బణం రేటు రెండు శాతం నుండి ఐదు శాతంగా ఉండడం ఆరోగ్యకరం. అది ఆరు శాతంగా ఉండడం భరించగల స్థాయి. అంతకు మించితే ప్రజలు ధరలతో తీవ్రంగా అల్లల్లాడు తున్నట్లు. ద్రవ్యోల్బణం అరికట్టడానికి అన్ని చర్యలూ చేపట్టినట్టు, అది మోస్తరుగా పెరగడం తప్పించి, పెద్దగా పెరిగే అవకాశం లేదంటూ ఆ మధ్య ఆర్థిక మంత్రి ఆశా భావం వెలిబుచ్చారు. రిజర్వు బ్యాంకు కూడా ఒకేసారి వడ్డీల్ని పెంచింది. అయినా సరే ఇప్పుడు ద్రవ్యోల్బణం 7 శాతంగా నమోదు కావడం ఆందోళనకరం. అంటే కట్టడి చర్యలు సమర్ధవంతంగా పనిచెయ్యడం లేదు. ఫలితంగా ప్రజలు, ముఖ్యంగా సామా న్యుల బాధలు వర్ణనాతీతం. మళ్ళీ కట్టడి చర్యల్లో భాగంగా రిజర్వు బ్యాంకు మరింతగా వడ్డీల్ని పెంచితే అది ప్రజానీకంపై మరింత భారాన్నే మోపుతుంది. అన్నిరకాల లోన్లు, రుణ వాయిదాల చెల్లింపులు అదనపు భారంగా తయారౌతాయి. కింద నుండి ధరల మంటలు అనుభవిస్తున్న వాడికి పైనుండి వేడినీళ్లు పోసినట్లవుతుంది. కాబట్టి ప్రభుత్వం రిజర్వు బ్యాంకు ద్వారా వడ్డీలు పెంచే చికిత్సకే మొగ్గు చూపించకుండా, అదే ఏకైక మార్గంగా చూడకుండా మిగతా ప్రయత్నాలు చెయ్యాలి. కరోనాలు, యుద్ధాలు, ప్రకృతి ప్రకోపాలతో పంట నష్టాలు ఈ స్థితికి కారణమైనా, ప్రజల్ని కాపాడుకోవాల్సిన ప్రయత్నం ప్రభుత్వం చెయ్యాలి. నగదు లభ్యతని తగ్గించడమొక్కటే ద్రవ్యోల్బణం కట్టడికి మార్గం కారాదు. దాని వల్ల ఉన్న కొనుగోలు శక్తి కూడా ఊడిపోతుంది. ప్రజలు తీసుకొనే ఆహారం తగ్గితే పోషకాహార లేమి ఎక్కువై అది మానవాభివృద్ధిపై దుష్ప్రభావం చూపుతుంది. ఇప్పటికే మానవాభివృద్ధి సూచీలో వెనకబడి ఉన్నాం. జనాభాలో చైనాను మించిపోతాం. దాన్ని విలువైన బలంగా మార్చుకోవాలంటే అందుకు తగ్గట్టుగా వ్యవహ రించాలి. స్థూల జాతీయోత్పత్తిలో బ్రిటన్‌ని దాటి ప్రపంచంలో ఐదో స్థానం ఆక్ర మించాం. ఆ సంపద అక్కరకు పనికి రావాలి. సంపన్నులపై పన్ను విధించి ఆదాయం పెంచుకోవడం ద్వారా, ఆహార పదార్థాలపై పన్ను తొలగించడం ద్వారా, వ్యవసాయానికి రుణపరపతి పెంచి దిగుబడిని పెంచడం ద్వారా, అవసరమైన నిత్యావసరాలు వెంటనే దిగుమతి చేసుకోవడం ద్వారా మార్కెట్‌లో ఫ్యూచర్ ట్రేడింగ్ కలాపాల్ని అరికట్టడం, బఫర్ స్టాక్ పెంచడం లాంటి చర్యల ద్వారా ద్రవ్యోల్బణాన్ని అరికట్టవచ్చన్నది సామాన్యుడిగా నా భావన. ప్రభుత్వం తలచుకొంటే మెరుగైన ఆర్థిక నిర్వహణ ద్వారా, సంక్షేమ చర్యల ద్వారా దేశం ఈ ఆర్థిక గండాన్ని గట్టెక్కగలదు. ఆ శక్తి ఉంది. మరి ఆసక్తి?

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, 9440836931.

పారిశ్రామిక భద్రతా విధానం అవశ్యం

డా॥ అఖిల మిత్ర

సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయం సమీపంలోని రూబీ మోటార్స్ రూబీ ప్రైడ్ లగ్జరీ హోటల్ భవనంలో సోమవారం మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది ఊపిరాడక మరణించారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రూబీ మోటార్స్ షోరూమ్‌లోని ఎలక్ట్రికల్ స్కూటర్ లేదా జనరేటర్‌లో పేలుడు కారణంగా మంటలు సంభవించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. హోటల్ భవనం మొదటి ఐదు అంతస్తులలో 28 గదులు ఉన్నాయి. రాత్రి 10 గంటల సమయంలో మంటలు చెలరేగడంతో 25 మంది అతిథులు ఉన్నారని అధికారులు తెలిపారు. పొగ బ్యాటరీల నుంచి 5వ అంతస్థుకు వ్యాపించిందని, పొగ వల్ల లాడ్జి రూముల్లో 8 మంది మృతి చెందగా, 9 మంది అస్వస్థతకు లోనయ్యారని పోలీసులు తెలిపారు. ఏడాది కాలంగా, రూబీ మోటార్స్ యజమానులు పేలుడు సంభవించిన భవనం సెల్లార్ నుండి అక్రమంగా ఈ-బైక్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఏలూరు జిల్లా అక్కిరెడ్డిగూడెంలో పోరస్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంలో ఆరుగురు బిహారీలు చనిపోయారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ పరిశ్రమను తాత్కాలికంగా మూసివేశారు. తమ గ్రామంలో గాలి, నీరు కలుషితమవుతుంది. దుర్వాసన భరించలేక పోతున్నాం, వెంటనే ఫ్యాక్టరీని అక్కడి నుంచి తరలించాలని గత కొన్ని సంవత్సరాలుగా ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు ప్రభుత్వం. హైదరాబాద్ బోయిగూడ గుజిరీ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో బిహార్ రాష్ట్రానికి చెందిన పదుకొండు మంది మృత్యువాత పడ్డారు. దేశంలో పారిశ్రామిక ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా పారిశ్రామిక భద్రతా విధానాన్ని తీసుకురాకుండా, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు మెరుగైన వసతి కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహించక పోవడంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మృతుల కుటుంబాలకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా, నష్టపరిహారం దొరకడం లేదు. పరిశ్రమల భద్రత కోసం అలాగే పది మంది కంటే ఎక్కువ కార్మికులు పనిచేసే చోట బలమైన రెగ్యులేటరీ వ్యవస్థను రూపొందించాలి. ప్రస్తుతమున్న రెగ్యులేటరీ వ్యవస్థ ఎందుకూ పనికి రాకుండా పోయింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా విధానాలు రూపొందించాలి. ఫ్యాక్టరీలపై పటిష్టమైన పర్యవేక్షణ యంత్రాంగం, థర్డ్ పార్టీ తనిఖీలు ఉండడంలేదు. ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే రూ.50 లక్షల పరిహారం ఇచ్చేలా చూడాలి. అలాగే జనావాసాల మధ్య పరిశ్రమలు, గోదాములు, రద్దీ ప్రదేశాలలో ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిశ్రమల పట్ల ప్రభుత్వం కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పారిశ్రామిక ప్రమాదాలు, గోదాములు, గుజిరీ, తుక్కు వ్యాపార సముదాయాల్లో ప్రమాదాల నివారణ చర్యలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించక ఏండ్లు గడుస్తుంది. ప్రమాదాలు జరిగిన తరువాత పనికి మాలిన సెక్షన్లు విధించి యజమానులను వదిలి వేస్తున్నారు తప్ప కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. ప్రతి నెల పరిశ్రమల్లో భద్రత, ప్రమాదాలు, కాలుష్య నివారణ అంశాలపై విస్తృతంగా చర్చించి నివారణోపాయాలు వెదకాలి. కొత్తగా పారిశ్రామిక ప్రమాదాల భద్రతా విధానం తీసుకువచ్చి, పరిశ్రమల భద్రత కోసం ప్రస్తుతమున్న రెగ్యులేటరీ వ్యవస్థలన్నీ పటిష్టం చేయాలి. దాదాపు డెబ్బై శాతం వాణిజ్య సముదాయాలు, షాపులు, గోదాములలో అగ్నిమాపక సాధనాలు ఉండడం లేదు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులను హై రిస్క్ జోన్లను గుర్తించాలి. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు ఉన్నాయన్న వివరాలు ఇండస్ట్రియల్ అట్లా సులో పొందుపరచాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు కూడా కేటగిరీ ప్రకారం ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలో నిర్ణయించుకునేలా వివరాలుం డాలి. పరిశ్రమలు సమ్మతి నివేదికలను ఏడాదికి రెండుసార్లు ఇచ్చేలా చూడాలి. స్థానిక రెసిడెన్షియల్ సంక్షేమ అసోసియేషన్ వారిని ఇండస్ట్రియల్, గోదాముల భద్రత సంఘంలో బాధ్యులుగా చేర్చాలి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటామన్న అంశాన్ని సంబంధిత కంపెనీ బోర్డులపై ప్రదర్శించాలి. థర్డ్ పార్టీ తనిఖీలు కూడా వీటిపై ఉండాలి. కేవలం పరిశ్రమల్లోనే కాకుండా ఇండస్ట్రియల్ పార్కుల్లో కూడా నిబంధనలు అమలవుతున్నాయా? లేదా? చూడాలి. పర్యవేక్షణ యంత్రాంగం బలంగా ఉండాలి. ఏలూరు, బోయగూడ దుర్ఘటనలో నిరోధకాలు ఉంటే ఆ ప్రమాదం జరిగేది కాదు. ఎవ్వరూ పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చింది. పాశ్చాత్య దేశాల్లో సమ్మతి నివేదిక ఇవ్వకపోతే భారీ జరిమానాలు వేస్తారు. కానీ, మన దగ్గర అలాంటి పరిస్థితి లేదు. మనం కూడా ఇలాంటి విషయాల్లో కఠినంగా ఉండాలి. పారిశ్రామిక ప్రమాదాలకు బాధ్యులైన వారి పట్ల కఠినంగా వ్యవహ రించాలి. పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలు, దేశంలోని పరిశ్రమల్లో సురక్షిత వాతా వరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్(ప్రత్యేక తనిఖీ) నిర్వహించి, ఇందుకోసం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్, బాయిలర్స్ విభాగం ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి ఆర్వో, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా అగ్నిమాపక అధికారి సభ్యులుగా జిల్లా స్థాయి కమిటీని రూపొందించాలి. బాయిలర్స్ విభాగంలో, పరిశ్రమల శాఖలో, అగ్నిమాపక శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలి. పరిశ్రమల్లో వంద రోజుల కొకసారి స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేసి, ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ప్రజల కొరకు పోర్టల్‌లో ఉండాలి. విష, ప్రమాదకర రసాయనాలు తయారీ పరిశ్రమలు, ప్రమాదకర విష పదార్థాలు నిల్వ చేసే పరిశ్రమలు. పేలుడు స్వభావం ఉన్న పదార్థాలు నిల్వ చేసి, వాటిని తయారు చేసే పరిశ్రమలు విభాగాలుగా వర్గీకరించి పరిశ్రమల్లో, పని చేసే చోటులో ప్రమాద నివారణకు చర్యలు చేపట్టేలా జిల్లా స్థాయి కమిటీలు రూపొందించుకొని విధిగా తనిఖీ చేయాలి.

అనేక రంగాల్లో లింగవివక్ష

- ఉపాధి, సంపాదనకు మహిళల అర్హతలతో పనిలేదు
- లేబర్ మార్కెట్‌లో లింగ-మత మైనారిటీలపై వివక్ష
- వివక్షరహిత భారత్ కావాలి
- ఆక్స్‌ఫామ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశం ఎన్నో రంగాల్లో ముందుకు వెళ్తోంది. అనేక విజయాలు సాధిస్తోంది. కానీ మన దేశంలో మహిళపై వివక్ష కొనసాగుతూనే ఉంది. చాలా రంగాల్లో లింగ వివక్ష ఉందని ఆక్స్‌ఫామ్ ఇండియా తాజాగా విడుదల చేసిన వివక్షపై నివేదిక-2022 తేల్చిచెప్పింది. కుల-మత వివక్షపై ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా లేబర్ మార్కెట్‌లో పరిస్థితులను అధ్యయనం చేసి ఈ నివేదికను విడుదల చేసింది. కుల మైనారిటీలు (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు), మతపరమైన మైనారిటీలు (ముస్లింలు), లింగ మైనారిటీలు (మహిళలు) ఎదుర్కొంటున్న వివక్షను ఆక్స్‌ఫామ్ అధ్యయనం చేసింది. ఈ నివేదిక ప్రకారం సగటున 99శాతం మంది మహిళలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిపరంగా లింగ వివక్షను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ లేబర్ మార్కెట్‌లో 100 శాతం, పట్టణాల్లో 98శాతం ఉద్యోగాలు పొందడానికి మహిళలు లింగ వివక్షను ఎదుర్కొంటున్నారు. 2004-05, 2019-20 వరకు ఉపాధి, కార్మికులపై ప్రభుత్వ డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. దేశంలో మహిళలకు పురుషులతో సమాన విద్యార్హతలు, పని అనుభవం ఉన్నప్పటికీ సామాజిక, యజమానుల పక్షపాత వైఖరి వల్ల కార్మిక మార్కెట్లో వివక్ష సాధారణమైందని నివేదిక పేర్కొంది. స్వయం ఉపాధి మహిళల కంటే పురుషులు 2.5 రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆడ - మగ వేతన కార్మికుల సంపాదన మధ్య 95శాతం వ్యత్యాసానికి ఈ వివక్షే కారణమని నివేదిక చెబుతోంది. పురుషులు, మహిళల మధ్య ఉపాధి అంతరం 98 శాతమని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల కంటే గ్రామీణ స్వయం ఉపాధి పనులు చేసే పురుషులు రెండింతలు సంపాదిస్తున్నారు. మహిళల కంటే నెలకు రూ.3,000 ఎక్కువగా ఆర్జిస్తారు. జీతాలు తీసుకునే మహిళలు 67 శాతం వివక్ష వల్ల, 33 శాతం విద్య, పని అనుభవం లేకపోవడం వల్ల తక్కువ వేతనాలు పొందుతున్నారని నివేదిక పేర్కొంది. మహిళలతో పాటు, దళితులు, ఆదివాసీలు వంటి అణచివేయబడిన వర్గాలు, ముస్లిం మైనారిటీలు కూడా ఉద్యోగాలు, జీవనోపాధి, వ్యవసాయ రుణాలను పొందడంలో వివక్షను ఎదుర్కొంటున్నారని ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక తెలిపింది. పురుషులు, మహిళలు ఒకే స్థాయిలో పనిచేయడం ప్రారంభించినా ఆర్థిక రంగంలో మహిళలు వివక్షకు గురవుతున్నారని నివేదిక తెలిపింది. దేశంలోని అట్టడుగు వర్గాల జీవితాలపై వివక్ష, దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి ఇప్పటివరకు చాలా తక్కువ ప్రయత్నాలు జరిగాయని వెల్లడించింది. ప్రతినెల సగటున, పురుషులు మహిళల కంటే రూ.4,000 ఎక్కువగా సంపాదిస్తున్నారని, ముస్లింల కంటే ముస్లిమేతరులు రూ. 7,000 ఎక్కువగా, కుల వ్యవస్థలో దిగువన ఉన్న వారు, గిరిజనులు ఇతరులతో పోలిస్తే రూ. 5,000 తక్కువగా సంపాదిస్తున్నారని నివేదిక తెలిపింది.

భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2020-21లో శ్రామిక శక్తిలో మహిళలు 25.1 శాతం ఉన్నారు. బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా వంటి అనేక దేశాలలో పోలిస్తే ఇది చాలా తక్కువ. 2004-05లో శ్రామిక శక్తిలో మహిళలు 42.7 శాతం ఉన్నారు. ఇప్పుడది దాదాపు సగానికి పడిపోయింది. ఈ కాలంలో దేశం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ, శ్రామికశక్తిలో మహిళల సంఖ్య తగ్గిపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. కరోనా మహమ్మారి కారణంగా లాక్‌డౌన్ సమయంలో ఉద్యోగాల కొరత తీవ్రమైంది. అది మహిళలను మరింత ఎక్కువగా శ్రామికశక్తి నుంచి బయటకు నెట్టివేసి ఉండవచ్చని ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది. ఇంటి బాధ్యతలు లేదా సాంఘిక స్థితి కారణంగా మంచి అర్హతలున్నప్పటికీ, మహిళలు ఉద్యోగాల్లో చేరడానికి మొగ్గు చూపట్లేదని, ఈ అంశం వివక్ష తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొంది. పితృస్వామ్య సమాజం, పురుషాధిక్యత వల్ల పురుషులతో సమానంగా లేదా అంత కంటే ఎక్కువ అర్హతలు ఉన్నప్పటికీ మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నట్లు వెల్లడించింది. కోవిడ్ మహమ్మారి ప్రారంభంలో, ముస్లింలలో నిరుద్యోగం 17 శాతం పెరిగింది. సమాజంలో వివక్ష సామాజికంగా, నైతికంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా ఉంది.

ఇది ప్రతికూల పరిణామాలకు దారి తీస్తుందని నివేదిక తెలిపింది. వివక్షరహిత భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, పౌర సమాజం కలిసి పనిచేయాలని ఆక్స్‌ఫామ్ ఇండియా సూచించింది. మహిళలందరికీ సమాన వేతనం, పనిచేసే హక్కు, రక్షణ కోసం సమర్థవంతమైన చర్యలను ముందస్తుగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆక్స్‌ఫామ్ ఇండియా కోరింది. వేతనాల పెంపుదల, నైపుణ్యాలను పెంచడం, ఉద్యోగ రిజర్వేషన్లు, సులభమైన రాబడితో సహా శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని పేర్కొంది. ప్రసూతి తర్వాత పని చేయడానికి సులభమైన పని ఎంపికలతో కార్మికశక్తితో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని భారత ప్రభుత్వానికి పిలుపునిచ్చింది

దమ్ముంటే అరెస్టు చేయండి: సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీలో అక్రమాలకు సంబంధించి తనకు వ్యతిరేకంగా ఉన్నాయని చెబుతున్న వీడియోలను సీబీఐకి అందజేయాలని ఉపముఖ్యమంత్రి, ఆప్‌నేత మనీశ్ సిసోడియా డిమాండ్ చేశారు. ఆ వీడియోలు వాస్తవమైతే తనను అరెస్టు చేయాలని సీబీఐకి విజ్ఞప్తి చేశారు. సీబీఐ తప్పుడు ప్రచారం చేస్తోందని, మద్యం కుంభకోణంలో అక్రమాలు జరిగితే నాలుగు రోజుల్లో తనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో సీబీఐ తనను అరెస్టు చేయకపోతే బీజేపీ చెబుతున్న స్టింగ్ ఆపరేషన్ వీడియో నకిలీదని, ఇది మరో అబద్ధమని సిసోడియా స్పష్టంచేశారు. తనపై బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యాలయాలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చడానికి ఇవన్నీ కుట్రలని వ్యాఖ్యానించారు. నకిలీ స్టింగ్ ఆపరేషన్ ఆరోపణలపై సోమవారం నాటికి తనను అరెస్టు చేయడంలో సీబీఐ విఫలమైతే ఇలాంటి కుట్రలకు ప్రధానమంత్రి కార్యాలయం పాల్పడినట్లు అంగీకరిస్తూ ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాలని సిసోడియా డిమాండ్ చేశారు. కొంతమంది ఎంపిక చేసిన వారి లబ్ధికోసమే ఢిల్లీ ప్రభుత్వం ఎక్సైజ్ విధానం రూపొందించినట్లు పేర్కొంటూ బీజేపీ షేర్ చేసిన వీడియోలపై సిసోడియా స్పందించారు. మద్యం పాలసీ ద్వారా తీసుకున్న ముడుపులను గోవా, అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ ఉపయోగించుకున్నట్లు బీజేపీ ఆరోపించింది.

భువనేశ్వర్‌లో వైమానిక ప్రదర్శన నేడు

భువనేశ్వర్: వైమానిక ప్రదర్శనకు ఒకరోజు ముందు ఒడిశా రాజధానిపై ఆకాశంలో వైమానిక దళం విమానాల సముదాయాన్ని చూసిన తర్వాత భువనేశ్వర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శన శుక్రవారం ఉదయం 10 గంటలకు జరీపటానా సమీపంలోని కుఖాయ్ నది ఒడ్డున ఉన్న బలిజాత్రా మైదానంలో జరగనున్నది. తొమ్మిది విమానాల సముదాయం గురువారం ఉదయం వేదికపై రిహార్సల్ నిర్వహించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పోలీస్‌స్టేషన్‌ను కాపాడుతున్న 'రబ్బర్ పాములు'

ఇడుక్కి(కేరళ): పోలీసు సిబ్బందిని సాధారణంగా సమాజానికి కాపలాదారులుగా పరిగణిస్తారు. అయితే కేరళలోని హై రేంజ్ ఇడుక్కిలోని అటవీ సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లో 'పాములే' 'రక్షకులు'' అంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న కోతుల బెడద నుంచి తమను తాము రక్షించుకోవాలని కోరుతూ, ఇక్కడి కేరళ-తమిళనాడు సరిహద్దులో ఉన్న కుంబుమెట్టు పోలీస్‌స్టేషన్ చుట్టూ పోలీసు సిబ్బంది రబ్బరు పాముల గుంపును మోహరించారు. కోతుల దళం సృష్టించిన బీభత్సంతో విసిగిపోయి, పోలీసులు, చివరకు వాటిని దూరంగా ఉంచడానికి ఈ పాము ఉపాయాన్ని ప్రయత్నించారు. ఎట్టకేలకు ఈ ఉపాయం విజయవంతమైంది. చైనా నిర్మిత పాములు, నిజమైన సరీసృపాలు పోలి ఉంటాయి. పోలీసు స్టేషన్ భవనం గ్రిల్, సమీపంలోని చెట్ల కొమ్మలు మొదలైన వాటితో సహా వివిధ ప్రదేశాలలో వీటిని ఏర్పాటు చ ఏశారు. విచ్చలవిడిగా సంచరించే జంతువులను కాపాడేందుకు ఇదే పని చేస్తున్న స్థానిక ఎస్టేట్ కీపర్ సలహా మేరకు పోలీసు సిబ్బంది 'పాము విన్యాసాన్ని' ప్రయోగించారు. రబ్బరు పాములను కట్టేసిన తర్వాత స్టేషన్‌కు ఎక్కడా ఒక్క కోతి కూడా రాలేదని కుంబుమెట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ పీకే లాల్‌భాయ్ తెలిపారు. కుంబుమెట్టు పోలీస్ స్టేషన్ ఇడుక్కిలోని నెడుంకందంలో ఉంది.

28న ఢిల్లీ ప్రభుత్వం రక్తదాన శిబిరం

న్యూఢిల్లీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలంతా రక్తదానం చేయాలని ఢిల్ల ముఖ్యమంత్రి అరవిం ద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ జయంతి. జాతీయ రాజధాని ప్రాంతంలోని 50 స్థలాల్లో ఢిల్లీ ప్రభుత్వం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వివరించారు. 'మీ ప్రాంతంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయకపోతే, మీరే ఏర్పాట్లు చేసుకోవచ్చు' అని ఆయన తెలిపారు. ఈ రక్తదాన శిబిరం నిర్వహణే భగత్‌సింగ్‌కు నివాళి అర్పించినట్లని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

దొంగతో పోరు...
ఆటోలో నుంచి పడి మహిళకు గాయాలు

గురుగ్రామ్: తన మొబైల్ ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించిన దొంగతో పోరాడుతూ కదులుతున్న ఆటో నుంచి పడి 40 ఏళ్ల మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం ఈ ఘటన జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసింది. తక్షణమే ఆమెను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మహిళ రెండు రోజులు అపస్మారక స్థితిలో ఉన్నందున, ఆమె బుధవారం పోలీసులకు తన వాంగ్మూలాన్ని ఇచ్చింది. సుశాంత్ లోక్ పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసినట్టు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్టార్ 56లో నివాసం ఉండే కిరత్ కౌర్ కౌసర్ ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తన కార్యాలయం నుంచి ఇంటికి తిరిగి రావడానికి ఆటో ఎక్కింది. ఆమె సెక్టార్ 42లోని ర్యాపిడ్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నప్పుడు, బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆటో దగ్గరకు వచ్చి ఆమె ఫోన్‌ను లాక్కున్నాడు. ఆమె ప్రతిఘటించినప్పటికీ హెల్మెట్ ధరించి ఉన్న దొంగ ఫోన్‌తో పారిపోగా కిందపడిపోయాడని ఆమె పోలీసులకు తెలిపింది. ఆటోడ్రైవర్ ఆమెను ఇంట్లో దించగా, తండ్రి ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడని పోలీసులు తెలిపారు. మరోవైపు నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ఆర్టీఐ కింద ఆ సమాచారం ఇవ్వక్కర్లేదు

న్యూఢిల్లీ : చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ) కింద ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ఆధారపడిన పత్రాలను బహిర్గతం చేయడాన్ని సమాచార హక్కు చట్టం కింద తిరస్కరించవచ్చని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. 2006 ముంబై రైలు పేలుళ్ల దోషి ఎహ్‌తేషమ్ కుతుబుద్దీన్ సిద్ధిఖ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ యశ్వంత్ వర్మతో కూడిన ఏకసభ్య ధర్మాసనం విచారించింది. యూఏపీఏ సెక్షన్ 45(1) కింద ప్రాసిక్యూషన్ కోసం ఒత్తిడి తెచ్చేందుకు ఎంహెచ్ఏ వినియోగించిన పత్రాల గురించి సమాచారాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) ద్వారా సిద్ధిఖ్ కోరారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కోర్టులు అనుమతి కోరడానికి ఈ సెక్షన్ సంబంధించినది. ప్రస్తుతం నాగ్‌పూర్ జైలులో ఉన్న సిద్ధిఖ్‌కు మరణశిక్ష పడగా దానిని అమలు చేయాల్సి ఉంది. పిటిషనర్ కోరిన సమాచారానికి ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఏ) కింద మినహాయించినట్లు జస్టిస్ వర్మ తెలిపారు. భారత సార్వభౌమాధికారం, సమగ్రత, భద్రత, ప్రయోజనాలను ప్రభావితం చేయగలిగే సమాచారాన్ని రాష్ట్రాలు అందించాల్సిన అవసరం లేదన్నారు. ఈ క్రమంలో పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. యూఏపీఏ చట్టంలోని సెక్షన్45 ప్రకారం నోటిఫికేషన్ జారీకి దారితీసే 'విభజించదగిన' సమాచారం ఏమిటో ప్రాథమికంగా గుర్తించడంలో కూడా పిటిషనర్ విఫలమయ్యారని కోర్టు పేర్కొంది. ఈ కేసు 2017, మే నాటిది. సమాచారం అందించేందుకు నిరాకరించిన క్రమంలో సిద్ధిఖ్... కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి రెండవసారి అప్పీలు చేశారు. ఈసారీ కూడా సమాచారం అందకపోవడంతో ఆయన సీఐసీ ఆదేశాలను ఢిల్లీహైకోర్టులో సవాల్ చేశారు. దీంతో ఎంహెచ్ఏ నుంచి కోర్టు వివరణ కోరింది. 2020, జనవరిలో నోటీసు జారీ చేసింది. దీనిపై గత వారం అంటే సెప్టెంబరు 9న ఎంహెచ్ఏ తమ స్పందనను కోర్టుకు తెలిపింది. ఈ క్రమంలో సిద్ధిఖ్ ఫిర్యాదును కోర్టు కొట్టివేసింది.

మేఘాలయలో 1652 అక్రమ బొగ్గు రవాణా కేసులు

షిల్లాంగ్: మేఘాలయలో బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించి 1,652 కేసులు నమోదయ్యాయని మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా గురువారం తెలిపారు. ఆగస్టు 31 వరకు నమోదైన 1,652 కేసుల్లో 1,354 కేసుల్లో చార్జిషీట్లు సమర్పించామని, 472 మందికి శిక్షలు పడ్డాయని మేఘాలయ అసెంబ్లీలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి చెప్పారు. అక్రమ బొగ్గు తవ్వకాలపై కూడా 109 కేసులు కూడా నమోదయ్యాయని, వాటిలో 108 కేసుల్లో చార్జిషీట్లు సమర్పించి 103 మందిని దోషులుగా నిర్ధారించినట్లు తెలిపారు. అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు పోలీసులు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి సభకు తెలిపారు.

బహిరంగమే...దాపరికం లేదు
కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికపై మిస్త్రీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ అంతా బహిరంగమేనని, ఇందులో ఎలాంటి దాపరికం ఉండదని ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుల నియామకం, ఏఐసీసీ ప్రతినిధుల నియామకం ఎలా జరుగుతుందో అలాగే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని చెప్పారు. మిస్త్రీ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనేక అంశాలను పంచుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడి పదవికి ఎవరైతే పోటీ చేయాలని కోరుకుంటారో వారిని వేర్వేరు రాష్ట్రాలకు చెందిన 10మంది పీసీసీ ప్రతినిధులు బలపర్చాల్సి ఉందని, నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయాలని చెప్పారు. 9వేల మంది ప్రతినిధులు కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొంటారు. సెప్టెంబరు 20 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. 'నేను ఇంతకుముందే చెప్పాను. నామినేషన్ వేయాలని కోరుకునే వారు ఇతర పీసీసీల నుంచి 10 మంది ప్రతినిధుల మద్దతు అవసరం. సంతకాలు చేయడానికి ముందు ప్రతినిధుల ఐడీ కార్డులు, క్యూఆర్ కోడ్‌లు తనిఖీ చేసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబరు 20 నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఓటర్ల జాబితా ఉంచుతాం. ఎవరైనా చూసుకోవచ్చు' అని మిస్త్రీ చెప్పారు. కొత్త అధ్యక్షుడి ఎన్నిక పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించడానికి ప్రదేశ్ రిటర్నింగ్ అధికారులతో తాను బుధవారం సమావేశమైనట్లు మిస్త్రీ తెలిపారు. ఐడీ కార్డులతో పాటు 9 వేలమందికి పైగా పీసీసీ ప్రతినిధులకు క్యూఆర్ కోడ్ ఇస్తున్నామన్నారు.

లౌరెన్కోకు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ: అంగోలా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన జోవో మాన్యుయల్ గొన్‌కాల్వ్స్ లౌరెన్కోకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. 68 ఏళ్ల వయసున్న లౌరెన్కో ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన మోదీ...అంగోలా అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన లౌరెన్కోకు అభినందనలు. ఆయనతో కలసి రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం కోసం కలసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నానంటూ ట్వీట్ చేశారు.

తమిళనాట ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకం

మదురై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరో కొత్త పథకాన్ని గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం ప్రవేశపెట్టారు. ఇక్కడ ఓ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు అల్పాహారం వడ్డించి...వారితో కలిసి ఆయన కూడా తిన్నారు. ఈ పథకం పేదల జీవితాల్లో సమూల మార్పు తీసుకొస్తుందని స్టాలిన్ చెప్పారు. అమెరికా, యూరప్ దేశాల్లోనూ ఇలాంటి పథకం అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ పథకం అమలు చేయడం వల్ల పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందని, చిన్నారుల్లో నైపుణ్యం పెరగడానికి దోహదపడుతుందని చెప్పారు. విద్యారంగంలో పెరియార్ ఈవీ రామస్వామి, సీఎన్ అన్నాదురై, ఎ.కరుణానిధి వంటి గొప్ప నాయకులు కన్న కలలు నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వారి కలలు పరిపూర్తి చేయడం తనకు గొప్ప ఆనందం కలిగిస్తోందని స్టాలిన్ అన్నారు. చెన్నైలోని అనేక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించినప్పుడు చాలామంది పిల్లలు అల్పాహారం లేకుండా వచ్చినట్లు తాను గమనించానన్నారు. ఆ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఆకలితో అలమటించరాదన్న నిర్ణయానికి వచ్చానన్నారు. అందుకే ఈ పథకం తీసుకొచ్చామని స్టాలిన్ చెప్పారు. అల్పాహారం అందించడం వల్ల రోజుకు ఒక చిన్నారికి రూ.12.75 ఖర్చవుతుందని, పాలనా పరిభాషలోనే ఖర్చు అనే పదాన్ని తాను ప్రయోగిస్తున్నానని, వాస్తవంగా దీనిని ఖర్చుగా చూడరాదని స్టాలిన్ చెప్పారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ కర్తవ్యమన్నారు. ఈ పథకాన్ని దశలవారీగా రాష్ట్రమంతా విస్తరిస్తామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను ఉచితాలు లేదా రాయితీలుగా చూడరాదన్నారు.

ఆ చట్టాలు ఆమోదించను
కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్

కొట్టాయం: కేరళలోని వామపక్ష ప్రభుత్వం రూపొందించిన యూనివర్సిటీ చట్టాల సవరణ బిల్లును ఆమోదించే ప్రసక్తి లేదని ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తేల్చి చెప్పారు. గురువారం ఆయన మాడియాతో మాట్లాడుతూ...వర్సిటీలకు సంబంధించి చట్టవిరుద్ధమైన అంశాలను చట్టబద్ధం చేస్తూ ఆ బిల్లును రూపొందించి అసెంబ్లీలో ఆమోదింప చేసినట్టు పేర్కొన్నారు. అర్హత లేని వారిని, ప్రభుత్వ పెద్దల బంధువులను వర్సిటీల్లో నియమించేందుకు మార్గం సుగమం చేస్తూ ఆమోదించిన యూనివర్సిటీ చట్టాల సవరణ బిల్లును తాను అనుమతించబోనని స్పష్టం చేశారు. తాను ప్రభుత్వానికి రబ్బరు స్టాంప్‌గా ఉపయోగపడనని పేర్కొన్నారు. అవసరమైతే తాను వర్సిటీల ఛాన్సలర్ పదవిని వదులుకుంటానని గతంలోను చెప్పానని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుకున్న వాటన్నటిపై తాను సంతకాలు చేయాలంటే సాధ్యం కాదని చెప్పారు. ప్రభుత్వం సంప్రదాయాలను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఆమోదం పొందిన లోకాయుక్త సవరణ బిల్లుకు తాను వ్యతిరేకమని పేర్కొన్నారు. గత ఆగస్టు 30, సెప్టెంబర్ 1 తేదీల్లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో లోకాయుక్త సవరణ బిల్లు, విశ్వవిద్యాలయ చట్టాల సవరణ బిల్లులను ఆమోదించిన విషయం తెలిసిందే.

క్రూర నేరాల్లో యూపీదే అగ్రస్థానం

న్యూఢిల్లీ: దేశంలో మహిళలు, పిల్లలు, వృద్ధులపై క్రూరమైన నేరాలు అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రం ఏదంటే బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ అని చెప్పక తప్పదు. సంబంధిత నేరాలపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న మొత్తం కేసుల సంఖ్య 13.81 లక్షలు కాగా, ఇందులో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 70 శాతానికి పైగా ఉండటమే ఇందుకు నిదర్శనం. స్వయంగా కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు ఈ మేరకు తెలిపారు. ఈ వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టులలో 9.33 లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత మహారాష్ట్ర-1.4 లక్షలు, తమిళనాడు-1.06 లక్షలు, పశ్చిమబెంగాల్-71,260, తెలంగాణలో 12,538 కేసులున్నాయి.

ఆలయాలకు సమీప మసీదులు తొలగించాలి
యూపీ మంత్రి సంజయ్ నిషాద్

బాగ్‌పట్ : రాష్ట్రంలోని ఆలయాలకు సమీపంలో ఉన్న అన్ని మసీదులను తొలగించాలని ఉత్తరప్రదేశ్ మత్స్యశాఖ మంత్రి సంజయ్ నిషాద్ వివాదాస్పద పిలుపునిచ్చారు. బుధవారం ఆయన బాగ్‌పట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మసీదులపై తన అక్కసును వెళ్లగక్కారు. దేశంలో మతపరమైన ఉన్మాదం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆలయాలకు సమీపంలో ఉన్న మసీదులను తొలగించాలని అన్నారు. రాష్ట్రంలో మదర్సాల నిర్వాహకులపైనా విషం వెళ్లగక్కారు.

మదర్సాలకు ఉగ్రవాదంతో సంబంధం ఉన్నట్లు తేలిందని ఆరోపించారు. మదర్సాల్లోనే చాలాసార్లు ఉగ్రవాదులు పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఈకారణం చేతనే ముస్లిం మత పెద్దలు మదర్సాల విషయంలో సర్వేకు మద్దతిస్తున్నారని చెప్పారు. ఇక రాష్ట్రంలోని ప్రతిపక్షాల మతపరమైన ఉన్మాదాన్ని వ్యాప్తి చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. మౌలానాలు దేశంలో పేదరికాన్ని పెంచారని చెప్పారు. వారి కారణంగానే ముస్లింల పిల్లలు చదువుకు దూరమయ్యారంటూ ఆరోపించారు. మసీదులను నిర్వహిస్తున్న మౌలానాలతో కలసి ప్రతిపక్షాలు అల్లర్లను ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. అయినా మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాలు అధికారం చేపట్టాక రాష్ట్రంలో అల్లర్లు తగ్గాయని పేర్కొన్నారు.

చిరుతలు వచ్చేస్తున్నాయ్!

- 74 ఏళ్ల తర్వాత దేశంలోకి
- నమీబియా నుంచి ప్రత్యేక విమానంలో తరలింపు

న్యూఢిల్లీ: 74 ఏళ్ల తరువాత మళ్లీ చీతా (చిరుతల్లో ఓ రకం)లు భారత్‌కు రాబోతున్నాయి. వన్యప్రాణుల సంరక్షకుల కృషి, కేంద్ర ప్రభుత్వ చొరవ ఫలితంగా నమీబియా నుంచి 8 చీతాలను ప్రత్యేక బోయింగ్ విమానంలో ఈ నెల 17న దేశంలోకి అడుగు పెట్టబోతున్నాయి. నాలుగు నుంచి ఆరేళ్ల మధ్య వయసు గల ఈ చీతాలను అదే రోజు ప్రధాని మోదీ మహారాష్ట్రలోని కునో పార్కులోకి విడిచిపెట్టనున్నారు. 1948లో అప్పటి ఉమ్మడి మధ్యప్రదేశ్ ప్రస్తుత ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొరియా జిల్లాలో చివరి చీతా చనిపోయిన తర్వాత దేశంలో వీటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. అందుకే వీటిని అంతరించిన జాతిగా 1952లో ప్రభుత్వం ప్రకటించింది.

విదేశాల నుంచి అరుదైన చిరుతపులులను భారత్‌కు తీసుకొచ్చి పునరుత్పత్తి ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా దక్షిణాఫ్రికా, నమీబియా దేశాల నుంచి 25కు పైగా చీతాలను మధ్యప్రదేశ్ రాష్ట్రం కునో పాల్పూర్ జాతీయ పార్కుకు దశల వారీగా తీసుకురానుంది. ప్రస్తుతం ఉత్తర ఆఫ్రికాలోని నమీబియా దేశం నుంచి 8 చీతాలను భారత్‌కు తీసుకురానున్నారు. వీటిలో ఐదు ఆడ చిరుతలు కాగా, మూడు మగ చిరుతలు. సెప్టెంబరు 17న తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ చిరుతలను కునో పార్క్‌లోకి విడుదల చేయనున్నారు. నమీబియా రాజధాని విండ్‌హోక్ నుంచి బోయింగ్ 747-400 కార్గో విమానంలో బయలుదేరే చిరుతలు... 16 గంటలపాటు ప్రయాణించి, సెప్టెంబరు 17 ఉదయానికి రాజస్థాన్ రాజధాని జైపూర్ విమానాశ్రయానికి చేరుకుంటాయి. అక్కడి నుంచి వాటిని హెలికాప్టర్‌లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని కునో పాల్పూర్ నేషనల్ పార్కుకు తరలించనున్నట్లు మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జెఎస్ చౌహాన్ తెలిపారు. ఈ ప్రయాణ కాలంలో చిరుతలు ఖాళీ కడుపుతోనే ఉంటాయని, ఇది తప్పనసరని పేర్కొన్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు... ఇంటర్-కాంటినెంటల్ చీతా ట్రాన్స్‌లోకేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. నమీబియా అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ... తగిన ఏర్పాట్లు చేస్తున్నారని అటవీ అధికారి తెలిపారు.

చీతాల కోసం ప్రత్యేక సౌకర్యాలు

నమీబియా నుంచి రానున్న చీతాల కోసం కునో జాతీయ పార్కులో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. వీటి ఆలనా పాలన చూసేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ చీతాలకు ఇప్పటికే వాక్సినేషన్ పూర్తి చేసి క్వారంటైన్‌లో ఉంచారు. ఆరోగ్యం, క్రూరత్వం, వేటాడే నైపుణ్యాలు, భవిష్యత్తులో వాటి సంతతిని పెంచగల జన్యుసామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని 8 చీతాలను భారత్ కోసం ఎంపిక చేశారు. కునో జాతీయ పార్కులో వీటిని తొలుత 30 రోజులపాటు క్వారంటైన్ ఎన్‌క్లోజర్లలో ఉంచుతారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 7,500 చీతాలు ఉన్నట్లు అంచనా. అంతరించిపోయిన ఈ వన్యప్రాణి జాతిని ప్రయోగాత్మకంగా భారత్‌లో పునఃప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ చీతాకు సుప్రీంకోర్టు 2020 జనవరిలో ఆమోదముద్ర వేసింది. భారతీయ వన్యప్రాణి సంరక్షకులు తొలిసారిగా 2009లో భారత్‌కు చీతాలను రప్పించే ప్రతిపాదనను చీతా కన్జర్వేషన్ ఫండ్‌కు చెందిన ప్రతినిధుల ముందుంచారు. దరిమిలా భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు డాక్టర్ మార్కర్ గత 12 ఏళ్లలో పలుమార్లు భారత్‌ను సందర్శించి చీతాలను ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన ప్రాంతాన్ని, ముసాయిదా ప్రణాళికలను పరిశీలించారు. చీతాల సంరక్షణ అంశంపై ఈ ఏడాది జులై 20న నమీబియా, భారత్‌లు పరస్పర అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ మేరకు 8 చీతాలను భారత్‌కు అందించడానికి ఆ ఒప్పందం ద్వారా మార్గం సుగమం అయింది.

'గాలి' బెయిల్ రద్దుచేయండి

సుప్రీంలో సీబీఐ పిటిషన్

న్యూఢిల్లీ: గనుల తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డిపై నమోదు చేసిన కేసులో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నమోదు చేసిన ఈ కేసులో చాలా కాలం పాటు జైల్లోనే ఉన్న జనార్దన్ రెడ్డి... సుప్రీంకోర్టును ఆశ్రయించి షరతులతో కూడిన బెయిల్ తీసుకుని విడుదలయ్యారు. ప్రస్తుతం తన సొంతూరు బళ్లారిలోనే ఉంటున్న ఆయన బెయిల్‌పైనే ఉన్నారు. ఈ క్రమంలో జనార్దన్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లో జనార్దన్ రెడ్డికి సంబంధించి సీబీఐ అధికారులు సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో ఆయన సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించిన సీబీఐ... మొత్తం కేసునే ఆయన పక్కదోవ పట్టిస్తున్నారని కోర్టుకు తెలిపారు. పదే పదే డిశ్చార్జ్ పిటిషన్లను దాఖలు చేస్తున్న నిందితులు... కేసు విచారణ ముందుకు సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం బళ్లారిలో ఉంటున్న జనార్దన్ రెడ్డిని అక్కడి నుంచి బయటకు పంపించాలని కూడా సీబీఐ అధికారులు సుప్రీంకోర్టును కోరారు.

మోదీ ప్రజాకంటక పాలన

- అన్ని రంగాల్లో వెనకబాటే
- సీపీఐ జాతీయ మహాసభల్ని జయప్రదం చేద్దాం
- రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - పాడేరు: నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా కంటక పాలన సాగిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం పాడేరులోని పీఎమ్మార్సీలో నిర్వహించిన అల్లూరి సీతారామ రాజు జిల్లా సీపీఐ సమితి సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని పేర్కొన్నారు. బీజేపీ అండ చూసుకుని మితవాద, మతోన్మాద శక్తులు దేశాన్ని కల్లోలితం చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులు కాలరాయబడుతున్నాయని మండిపడ్డారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో సామాన్య, పేద మధ్యతరగతి ప్రజలు జీవించలేని విధంగా నిత్యావసరాల ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు, అనాలోచిత జీఎస్టీ అమలుతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలన్న ప్రయత్నం అన్నదాతల ఉద్యమంతో ఆగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజల పాలిట శాపంగా మారిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సీపీఐ 24వ జాతీయ మహాసభల్ని అక్టోబరు 14 నుంచి 18 వ తేదీ వరకూ విజయవాడ నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయోద్యమ కాలం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన ఆంధ్రప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ మహాసభలు చారిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, జమిందారి, జాగీర్దారీ విధానాలకు వ్యతిరేకంగా, భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం సీపీఐ చేసిన పోరాటాలను వివరించారు. విజయవాడ నగరంలో జరుగనున్న పార్టీ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా పార్టీ కార్యదర్శి పొట్టిగ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, ముట్టడం రాజబాబు, దిసారి బిమలమ్మ, పెట్ల పోతురాజు విష్ణుమూర్తి, సింహాచలం, పాడేరు మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ, జల్లి రాజు బాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను కూడా తొలగించలేరా...

బీజేపీ తీరుపై మండిపడ్డ ఆప్

న్యూఢిల్లీ: ఘాజీపూర్‌లోని ఓఖ్లా ప్రాంతంలో చెత్త పేరుకుపోయిన ప్రాంతానికి తమ పార్టీ నేతలను చేరుకోకుండా పోలీసులు అడ్డుకోవడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను రక్షించడానికి పోలీసులను మోహరించారా అంటూ బీజేపీపై మండిపడ్డారు. మహిళలకు రక్షణ కల్పించాల్సి పోలీసులు బీజేపీ ప్రభుత్వంలో చెత్త కొండలకు రక్షణగా నిలుస్తున్నారని ట్వీట్ చేశారు. బీజేపీ పాలనలో ఉన్న ఘాజీపూర్‌లోని ఓఖ్లా ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించడానికి బుధవారం ఆప్ ఎమ్మెల్యే అతిషి నేతృత్వంలోని పార్టీ బృందం అటువైపుగా వెళుతున్న తరుణంలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేజ్రీవాల్ స్పందించారు. నగర సరిహద్దులో ఉన్న ఆ ప్రాంతం బీజేపీ నేతృత్వంలోని పురపాలక సంస్థ పరిధిలో ఉందని చెప్పారు. అక్కడున్న చెత్తను తొగించడానికి తమ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా బీజేపీ నేతృత్వంలోని పురపాలక సంస్థ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. బీజేపీ పాలన తీరును ఎండగట్టడానికి నెల రోజుల నుంచి ఆప్ ఒక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఆప్ ఎమ్మెల్యే అతిషి నేతృత్వంలోని బృందం అక్కడకు చేరుకోకుండా పోలీసులు అడ్డుకోవడంతో రెండు పార్టీల మధ్య వివాదం చెలరేగింది. ఇదిలా ఉండగా ఈ ఘటనపై బీజేపీ తీరుపై ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే సౌరభ్ భరద్వాజ్ నేతృత్వంలోని పార్టీ శ్రేణులు గురువారం బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. బీజేపీ తన పాలనలోని లోపాలు బయటపడకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని నిజాలను దాస్తోందని భరద్వాజ్ ధ్వజమెత్తారు. ఆ ప్రాంతంలోని చెత్తను తొలగించామని ఐదేళ్లుగా అబద్దాలు చెబుతోందని దుయ్యబట్టారు.

అక్టోబరు 1 నుంచి 'దుల్హన్' అమలు

హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో అక్టోబరు 1వ తేదీ నుంచి దుల్హన్ పథకం అమలు చేస్తామని ఏపీ ప్రభుత్వం తెలియజేసింది. గతంలో అమలు జరిగిన దుల్హన్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ హైకోర్టులో మైనార్టీ పరిరక్షణ సమితి పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు ఎందుకు దుల్హన్ పథకం అమలు చేయడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం దీనిపై జరిగిన విచారణలో భాగంగా వచ్చే నెల 1 నుంచి దుల్హన్ పథకం అమలు చేయనున్నట్లు అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు జీవో 39 సమర్పించారు. అర్హులకు యాభై వేల నుంచి లక్ష రూపాయల వరకూ దుల్హన్ పథకం కింద ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆ మేరకు అమలు చేయాలని న్యాయస్థానం ఆర్డర్ ఇచ్చింది. దుల్హన్ పథకం అమలులో మీరు విజయం సాధించారని పిటిషనర్ తరుపు న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. న్యాయస్థానం ఆదేశాలతో పిటిషనర్ హర్షం వ్యక్తం చేశారు.

డెయిరీ అవకతవకల కేసులో... ఏసీబీ అదుపులో గుజరాత్ మాజీ హోంమంత్రి

మెహసానా: గుజరాత్ మాజీ హోంమంత్రి విపుల్ చౌదరిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అదుపులోకి తీసుకుంది. ఈ విషయాన్ని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ మకరంద్ చౌహాన్ గురువారం వెల్లడించారు. దూద్‌సాగర్ డెయిరీలో దాదాపు రూ. 500 కోట్ల అవకతవకలకు పాల్పడిన కేసులో ఆయన్ను అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. అమూల్ బ్రాండ్ పాల ఉత్పత్తులను నిర్వహిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు మాజీ చైర్మన్ అయిన చౌదరి మెహసానాలోని దూద్‌సాగర్ డెయిరీకి కూడా చైర్మన్‌గా వ్యవహరించిన తరుణంలో డెయిరీకి సంబంధించిన నిధుల్లో దాదాపు రూ.500 కోట్ల మేర ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చౌదరికి చార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేసిన శైలేశ్ పారిఖ్‌ను కూడా అక్రమాస్తుల నిరోధక చట్టం కింద బుధవారమే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చౌదరి దూద్‌సాగర్ డెయిరీ చైర్మన్‌గా వ్యవహరించిన కాలంలో మోసం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద ఆయనపై కేసులు నమోదయ్యాయని చెప్పారు. దూద్‌సాగర్ డెయిరీ కార్మికులకు బోనస్‌గా చెల్లించాల్సిన రూ.14.8 కోట్ల నిధులను స్వాహా చేసిన ఆరోపణలతో సీఐడీ అధికారులు ఆయన్ను గతంలో అరెస్టు చేసిన విషయం విధితమే. 1996లో సీఎం శంకర్‌సింగ్ వాఘేలా ప్రభుత్వంలో చౌదరి హోంమంత్రిగా పనిచేశారు.

శాసన మండలిలో నిరసనలు

- వివిధ అంశాలపై సభ్యుల ప్రశ్నోత్తరాలు
- మంత్రుల హడావుడి జవాబులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిపక్ష టీడీపీ సభ్యుల నిరసనల మధ్యే శాసన మండలి సమావేశం కొనసాగింది. వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు హడావుడిగా జవాబులిచ్చారు. శాసన మండలి సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాలు జరుగుతుండగా, ప్రతిపక్ష సభ్యులు జాబ్ క్యాలెండర్‌పై నిరంతర నిరసనలు తెలిపడంతో, చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు వారికి ఎంతసేపు నచ్చజెప్పినా వెనక్కి తగ్గనందున, మండలిని వాయిదా వేశారు. అనంతరం రాష్ట్రంలో భూముల మార్పిడికి సంబంధించి ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి, దువ్వారపు రామరావు, బి.తిరుమల నాయుడు అడిగిన ప్రశ్నకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమాధానమిచ్చారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్పిడి కోసం పటిష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. నిరుపేదలందరికీ ప్రభుత్వ పరంగా అందజేసే వైద్య సదుపాయాలపై సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, ఇందుకూరి రఘురాజు, కేఎస్ లక్ష్మణరావు, బల్లి కల్యాణ చక్రవర్తి, రాజగొల్ల రమేష్ యాదవ్, చెన్నుబోయిన శ్రీనివాస రావు తదితరులు అడిగిన ప్రశ్నకు వైద్యారోగ్య సంక్షేమశాఖ మంత్రి విడదల రజని జవాబిచ్చారు. జిల్లాకు ఒక వైద్య కళాశాల పేరుతో పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వం కేటాయించిన 60 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సభ్యుడు అంగర రామ్మోహనరావు కోరారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును ప్రభుత్వం 62 ఏళ్లకు పెంచినప్పటికీ ఎయిడెడ్ కళాశాలు, గురుకులల్లో పనిచేసే బోధనా, భోదనేతర సిబ్బందికి ఈ విధానం వర్తింపచేయలేదని, తక్షణమే చర్యలు తీసుకోవానిలని కోరారు.

టీడీపీ సభ్యుల తీరు ఆక్షేపణీయం: బొత్స, జోగి

మండలిలో టీడీపీ సభ్యులు చేస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉందని మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేష్, శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రవర్తన పార్లమెంటరీ విధానాలకు విరుద్ధమని, వారిపై గట్టి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలిని ఆర్డరులో పెట్టాలన్నారు. నిరసనల మధ్య శాసన మండలి కొనసాగుతూ ఉండగానే నిత్యావసర వస్తువుల ధరల అసాధారణ పెరుగుదలపై సభ్యుడు చిక్కాల రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బదులిచ్చారు. సభ్యులు దువ్వాడ శ్రీనివాస్, శ్రీనివాసరావు, బల్లి కల్యాణ చక్రవర్తి, తూమాటి మాధవరావు తదితరులు రాష్ట్రంలో ఓడ రేవులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం, పరిస్థితిని ప్రశ్నించగా, దానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ జవాబిచ్చారు. 2019 నుంచి ఉపాధి హామీ పథకం అమలు పురోగతి, ఎన్ని పనిదినాలు కల్పన, చేసిన ఖర్చు విషయాలపై అడిగిన ప్రశ్నకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు సమాధానం ఇచ్చారు. డప్పు కళాకారులు, చర్మ కారులకు మంజూరు చేసిన సామాజిక పింఛన్లు, వాటిపై ఖర్చు, 2014-19 మధ్య కాలంలో చేసిన వ్యయంపై సభ్యులు అరుణ్ కుమార్, రవీంద్రబాబు, కళ్యాణ చక్రవర్తి తదితరులు అడిగిన ప్రశ్నలకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ముత్యాల నాయుడు బదులిచ్చారు. అనంతరం శాసన మండలిని శుక్రవారానికి వాయిదా చేశారు.

జాతీయ విద్యావిధానం అమలు: మంత్రి ఉషశ్రీ చరణ్

అంగన్‌వాడీ, మినీ అంగన్ వాడీ కేంద్రాలపై సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఇళ్ల వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 48,770 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, మిగిలినవి చిన్న తరహా అంగన్‌వాడీ కేంద్రాలని వివరించారు. జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి మూడు, నాలుగేళ్లు పైబడిన పిల్లల కోసం పీపీ-1, పీపీ-2 విద్యా విధానాన్ని అమలు పరుస్తున్నామన్నారు.

నిరుపేదలందరికీ మెరుగైన వైద్యం: మంత్రి రజని

నిరుపేదలు అందరికీ మెరుగైన వైద్య సేవలు అందజేయాలనే లక్ష్యంతో, సీఎం జగన్ నేతృత్వంలో ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు అందజేస్తున్న పలు రకాల వైద్య సేవలు, వాటి విస్తరణ, నాడు-నేడు కార్యక్రమం కింద ఆసుపత్రుల ఆధునీకరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టును అమలు పర్చడం, నూతనంగా వైద్య కళాశాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది భర్తీ కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ చర్యలను మంత్రి వివరించారు.

సమయోచిత, సమూహ విస్తరణపై చర్చలు

న్యూఢిల్లీ: సమయోచిత (టాపికల్) అంశాలు, సమూహ విస్తరణ (గ్రూపింగ్ ఎక్స్‌ప్యాన్షన్)పై చర్చలు జరపాలని ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు క్రమంలో భారత్ భావిస్తోంది. రష్యా, చైనా అధ్యక్షులతో పాటు ప్రధాని మోదీ శుక్రవారం ఉజ్బెక్ నగరంలో జరగబోయే ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనున్నారు. ప్రాంతీయ భద్రతా సవాళ్లను, వాణిజ్యాన్ని పెంపొందించేందుకు ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్ నగరంలో శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇదే క్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయేవ్ తదితర నేతలతో ద్వైపాక్షిక చర్చలను నరేంద్రమోదీ నిర్వహించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక భేటీ గురించి సమాచారం లేదు. ప్రధాని పర్యటన గురించి విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా గురువారం విలేకరులతో మాట్లాడారు. జిన్‌పింగ్‌తో మోదీ భేటీ గురించి ప్రశ్నించగా ద్వైపాక్షిక సమావేశాల షెడ్యూలు విడుదలైన తర్వాతే చెప్పగలమన్నారు. ఎస్‌సీఓ, దాని లక్ష్యాలకు భారత్ ఇస్తున్న ప్రాముఖ్యతను ప్రతిబింబించేందుకు ఈ సదస్సులో మోదీ పాల్గొంటున్నట్టు తెలిపారు. సమయోచిత ప్రాంతాలతో పాటు అంతర్జాతీయ అంశాలు, సంస్కరణలు, ఎస్‌ఈసీఓ విస్తరణ, ప్రాంతీయ భద్రతా, సహకారం వంటి అంశాలపై చర్చలను భారత్ ఆశిస్తోందన్నారు. కనెక్టివిటీని పెంచుకోవడంతోపాటు వాణిజ్య-పర్యాటక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడం కూడా అజెండాలో భాగమేనని చెప్పారు. ఇదిలావుంటే, మోదీ... పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైజీలతో వేర్వేరుగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నట్టు రష్యా, ఇరాన్ మీడియా చెబుతోంది.

మంత్రి మేరుగు అనుచిత వ్యాఖ్య

బర్తరఫ్ చేయాలని టీడీపీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున చేసిన అనుచిత వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. స్టడీ సర్కిల్స్‌కు సంబంధించి మంత్రి నాగార్జున సమాధానం చెబుతుండగా, టీడీపీ సభ్యులు జాబ్ క్యాలెండర్‌కు సంబంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. జగన్‌కు వ్యతిరేకంగా రాసిన ప్లకార్డును పట్టుకున్న టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి మంత్రికి సమీపంలో నిలబడి నినది స్తుండగా, మంత్రి మేరుగు ఆయనపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ... నువ్వు దళితుడివైతే, దళితులకు పుడితే... టీడీపీ అధినేత చంద్రబాబు బంధనాల నుంచి బయటకు రావాలంటూ ఊగిపోయారు. దీంతో టీడీపీ సభ్యులంతా మంత్రిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఆ తర్వాత సభను వాయిదా వేయడంతో టీడీపీ ఎమ్మెల్యేలంతా స్పీకర్ తమ్మినేని సీతారాం చాంబర్‌కు వెళ్లి మంత్రి మేరుగు నాగార్జున వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. దళితులకే పుట్టావా అంటూ మంత్రి తనపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బాలవీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. సభ్యుల పుట్టుక గురించి అధికార పార్టీ నేతలు పదే పదే ప్రస్తావించడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ తరహా వ్యాఖ్యలను స్పీకరుగా ఉండి... కంట్రోల్ చేయకుంటే ఎలా అంటూ విరుచుకుపడ్డారు. అదే సమయంలో మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి స్పీకర్ చాంబర్‌కు వచ్చారు. మంత్రి మేరుగు అటువంటి వ్యాఖ్యలు చేయలేదని సమర్థించారు. అయితే తాము అబద్ధం చెపుతున్నామా అంటూ శ్రీకాంత్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించుకోవాలని పయ్యావుల కేశవ్ సూచించారు. గతంలో చంద్రబాబు, లోకేష్ గురించి కూడా ఇదే తరహాలో ప్రస్తావించి రికార్డుల్లేవన్నారని వారు మండిపడ్డారు. మేరుగు క్షమాపణ చెప్పకుంటే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సభ తిరిగి ప్రారంభించగానే మంత్రి మేరుగు వివరణ ఇస్తూ... టీడీపీ సభ్యుల్ని తాను ఏమీ అనలేదని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించలేదని తెలిపారు. చంద్రబాబే గతంలో ఎస్సీ కులంలో ఎవరూ పుట్టరంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. మంత్రి మేరుగును టీడీపీ సభ్యులు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారని మరో మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బాలవీరాంజ నేయ స్వామి హద్దు దాటి మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. ఎవరైనా దళితుల కుటుంబంలో పుట్టడానికి ఇష్టపడతారా అని గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారని సభలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పుకొచ్చారు. దీనిపై వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ... నాపై చేసిన వ్యాఖ్యలకు మంత్రి పశ్చాత్తాపం వ్యక్తం చేస్తారనుకున్నానని, నా పుట్టుక గురించి అసెంబ్లీలో మాట్లాడటమే గాక ఎదురు దాడికి పాల్పడడం సరికాదన్నారు. రికార్డులు పరిశీలించండి...తప్పయితే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. రికార్డుల్లో నేను చెప్పినట్లు ఉంటే మంత్రిని బర్తరఫ్ చేస్తారా? అని సవాల్ విసిరారు. దీనిపై స్పీకర్ జోక్యం చేసుకుంటూ సభా సమయం వృథా అవుతోందంటూ మైక్ కట్ చేశారు.

ఇవి ప్రభుత్వ హత్యలే

- విపక్షాల ఆరోపణ
- అధికార పక్షం ఖండన
- ఐసీయూలో రోగుల మరణాలపై దద్దరిల్లిన కర్ణాటక అసెంబ్లీ
- మృతులకు రూ.25 లక్షల పరిహారానికి 'సిద్ధ' డిమాండు

బళ్లారి / బెంగళూరు: కరెంటు కోతల వల్ల ప్రభుత్వాసుపత్రి ఐసీయూలోని ఇద్దరు రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటన కర్ణాటకలోని బళ్లారి విమ్స్‌లో జరిగింది. మరణాలకు కరెంటు కోతయే కారణమన్న ఆరోపణలను కర్ణాటక ప్రభుత్వం తోసిపుచ్చింది. దీనిపై విచారణ జరిపిస్తామని తెలిపింది. అయితే ఐసీయూ మరణాలపై గురువారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. ప్రభుత్వ నిర్లక్ష్యం రోగుల ప్రాణాలు తీసిందని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. మరణాలకు బాధ్యత వహిస్తూ ఆరోగ్య మంత్రి కె.సుధాకర్ రాజీనామా చేయాలని సభ్యులు డిమాండు చేశారు. జీరోఅవర్‌లో ఈ అంశాన్ని ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య లేవనెత్తారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు ఆసుపత్రిలో కరెంటు కోత ఉన్నదని, జనరేటర్ పనిచేయక పోవడంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఈ మరణాలకు ప్రభుత్వంతో పాటు వైద్యకళాశాల డైరెక్టర్, ఆరోగ్యశాఖ మంత్రి, అధికారులు, జిల్లా డీసీ బాధ్యత వహించాలన్నారు. విద్యుత్ కోత ఏర్పడినప్పుడు జనరేటర్ ఎందుకు పని చేయలేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలకు డిమాండు చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 25లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. సిద్ద తీరును పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జేసీ మధుస్వామి తప్పుపట్టారు. ఈ అంశాన్ని లేవనెత్తిన సమయంలో ప్రతిపక్ష నేత తన నోటీసులో వినియోగించిన భాషపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మరణాలకు ప్రభుత్వమే నేరుగా బాధ్యత వహించాలని లేఖ పేర్కొంది. వీటిని ప్రభుత్వ హత్యలుగా చెబుతోంది. ఇది ఏమిటి అని మంత్రి అసహనానికి గురయ్యారు. దీంతో మధుస్వామికి సిద్దరామయ్యకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురు వర్గీయుల జోక్యంతో గొడవ పెద్దది అయింది. స్పీకర్ విశ్వేశ్వర్ హెగ్డే వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రోగుల మరణానికి కరెంటు కోత కారణం కాదని బళ్లారి జిల్లా ఇంచార్జి మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. ఆసుపత్రిలో గంటన్నరకు సరిపోయే పవర్‌బ్యాకప్ ఉన్నదని, ఆరోగ్యం క్షీణించడం వల్లనే ఆ ఇద్దరు మరణించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ నివేదించినట్లు వెల్లడించారు. కరెంటు కోతలే ఈ మరణాలకు కారణమని నివేదికలు చెబుతుండటంతో దీనిపై దర్యాప్తు జరిపించాలని సిద్దరామయ్య డిమాండు చేశారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు శవ రాజకీయాలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. దీంతో మధుస్వామి స్పందిస్తూ ఒకరు కిడ్నీ సమస్యతో మరణిస్తే మరొకరు పాము కాటుకు గురై చనిపోయారని, కరెంటు కోత వల్ల కాదన్నారు. అనుమానాలు ఉన్న క్రమంలో దీనిపై విచారణ జరిపించి సభకు నివేదిక అందజేస్తామని చెప్పారు. ఆసుపత్రి తప్పు ఉన్నట్లు తేలితే మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వడాన్ని పరిశీలిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మధుస్వామి అన్నారు. ఇదిలావుంటే, రోగి మౌలా హుస్సేన్ (35) మూత్రపిండాల సమస్యతో ఆసుపత్రిలో చేరగా పాముకాటుకు గురై చెట్టమ్మ (30) ఐసీయూలో ఉంది. ఈ ఇద్దరు బళ్లారిలోని జిల్లా కేంద్రకార్యాలయంలోగల విమ్స్ ఆసుపత్రిలో బుధవారం ఉదయం 9.30-9.35 గంటల ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయారు. కరెంటు కోత - ఆ సమయంలో జనరేటర్ పనిచేయక ఈ ఇద్దరు మృత్యువాత పడినట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఆరోపణలను విమ్స్ కొట్టి పారేసింది. కరెంటు పోయినప్పుడు మరణాలు సంభవించలేదని, ఆసుపత్రిలో బ్యాకప్ ఉన్నట్లు తెలిపింది.

కేసుల విచారణలో కొత్త విధానంపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి



న్యూఢిల్లీ: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు విచారణకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ ప్రవేశపెట్టిన కొత్త విధానంపై సాక్షాత్తు సుప్రీంకోర్టు ధర్మాసనం అసంతృప్తి వెలిబుచ్చింది. ఓ క్రిమినల్ కేసును విచారిస్తున్న సందర్భంగా సంజయ్ కిషన్ కౌల్ (సీనియారిటీ ప్రకారం 3వ స్థానంలో ఉన్న జడ్జి) నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన ఆదేశాల్లో ఈ ప్రస్తావన వచ్చింది. 'మధ్యాహ్నం సెషన్ వ్యవధిలో అనేక అంశాలు ఉన్నందున ప్రస్తుత కేసు మాదిరిగా విచారణ కోసం నిశ్చయించిన వ్యవహారాలను స్వీకరించడానికి కొత్త లిస్టింగ్ విధానం తగిన సమయాన్ని ఇవ్వడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణను నవంబరు 15న చేపట్టేందుకు నిర్ణయిస్తూ సెప్టెంబరు 13న ఉత్తర్వులు జారీ చేసింది. కేసుల విచారణకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి ప్రవేశపెట్టిన కొత్త విధానంలో, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రెండు వేర్వేరు షిఫ్టులలో పనిచేస్తున్నారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో 30 మంది న్యాయమూర్తులు ఇద్దరి చొప్పున కూర్చొని, తాజా పిటిషన్‌లతో సహా ఒక్కో బెంచ్‌లోని 60కి పైగా ఇతర అంశాలను పరిష్కరించాలని కొత్త వ్యవస్థ నిర్దేశిస్తోంది. మంగళవారం, బుధ, గురువారాల్లో న్యాయమూర్తులు ముగ్గురు చొప్పున కూర్చుని, ముందుగా (ఉదయం సెషన్‌లో) సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న పాత కేసులను మధ్యాహ్నం 1 గంటల వరకు సవివరంగా విచారించాలని కొత్త యంత్రాంగం నిర్దేశించింది. భోజనానంతర సెషన్ (మధ్యాహ్నం సెషన్)లో, న్యాయమూర్తులు ఇద్దరు చొప్పున విచారణకు కూర్చుంటారు. ముందుగా బదిలీ పిటిషన్‌లకు సంబంధించిన విషయాలను (ఒక అధికార పరిధి నుండి మరొక అధికార పరిధికి బదిలీ) చేపడతారు. ఇవి 20 నుంచి 30వరకు సాయంత్రం 4గంటల వరకు ఉంటాయి. ఆపై పిల్స్ సహా తాజా కేసులను తీసుకోవడం ప్రారంభిస్తారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం... జస్టిస్ లలిత్ ఆగస్టు 27న ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి కొత్త వ్యవస్థతో అత్యున్నత న్యాయస్థానం మొత్తం 5వేల కేసులను పరిష్కరించగలిగింది.

మీడియా వార్తల్లో నిజం లేదు: సీజేఐ

కేసుల విచారణపై ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం విమర్శించిందని మీడియాలో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని భారత ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ పేర్కొన్నారు. సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ కొత్త విధానంపై ఏకాభిప్రాయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. కేసులను లిస్టింగ్ చేసే విషయంలో సుప్రీంకోర్టు కొత్త విధానాన్ని అవలంబిస్తోందని, మొదట్లో కొన్ని సమస్యలు తప్పవని ఆయన అన్నారు. ఈ విషయంలో మీడియాలో ఏ వార్తలొచ్చినా అవి సరైనవి కావని స్పష్టం చేశారు.

మనం ఉరిదీసే ఆఖరి పెట్టుబడిదారు మనకు ఆ తాడు అమ్మినవాడై ఉండాలి.

- కార్ల్ మార్క్స్

కార్మికోద్యమంలోంచి కమ్యూనిజంలోకి

దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘ వ్యవస్థాపకుడు, కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడానికి కాన్పూర్‌లో 1925 డిసెంబర్ 25, 26 తేదీల్లో జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన విప్లవ భావాల ప్రవర్తకుడు, అంటరాని తనాన్ని నిర్మూలించడానికి బౌద్ధం ఉపకరిస్తుందనుకున్న వ్యక్తి, వెనుకబడిన తరగతుల ఆత్మ గౌరవ పోరాట స్ఫూర్తి ప్రదాతల్లో ఒకడు, మొట్టమొదట బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడానికి కారకుడు...ఇలా బహుముఖీన వ్యక్తిత్వం గల వ్యక్తి సింగారవేలు చెట్టియార్ (1860 ఫిబ్రవరి - 1946 ఫిబ్రవరి 11) కాకుండా మరొకరు ఉండడానికి అవకాశమే లేదు.

జాలర్ల కుటుంబంలో పుట్టిన సింగారవేలు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుంచి పట్టభద్రుడై 1907లో బి.ఎల్. పట్టా సంపాదించి మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1890లో మద్రాసులో సింగారవేలు శాక్య బౌద్ధ సంఘం నెలకొల్పారు. కొంతకాలం బౌద్ధుడిగానే బతికారు.

భారత కార్మికోద్యమ చరిత్రలో మద్రాసుకు విశిష్ట స్థానం ఉంది. రష్యా విప్లవం విజయవంతమైన ఆరు నెలల్లోగానే 1918 ఏప్రిల్ 27న బకింగ్‌హాం అండ్ కర్నాటిక్ మిల్లులో మొట్టమొదటి కార్మిక సంఘం ఏర్పడింది. దాని ప్రథమ అధ్యక్షుడు సింగారవేలు చెట్టియారే. వి.కళ్యాణ సుందరం మొదలైన వారితో కలిసి సింగారవేలు ఎం.ఎస్.ఎం. కార్మిక సంఘం, ముద్రణా కార్మికుల సంఘం, అల్యూమినియం కార్మికుల సంఘం, రైల్వే సిబ్బంది కార్మిక సంఘం, కోయంబత్తురు, మదురై నేత పని వారి సంఘం లాంటి వాటి స్థాపనకు కారకుడు సింగారవేలే. కార్మికుల సమస్య మీద కాంగ్రెస్ పోరాడాలని

ఆయన పట్టుబట్టారు.

1921 జూన్ 21న బకింగ్‌హాం అండ్ కర్నాటిక్ మిల్లు కార్మికుల చేత సమ్మె చేయించారు. ఈ సమ్మె ఆరు నెలలు కొనసాగింది. కాల్పుల్లో ఏడు మంది కార్మికులు మరణించారు. 1922లో అల్యూమినియం కార్మికులు, అడిసన్స్ ప్రెస్ కార్మికులు, 1922 డిసెంబర్‌లో మద్రాస్ ట్రామ్‌వే కార్మికులు, 1924 ఆగస్టు 30న మద్రాసు కార్పొరేషన్ల పాకీ పని వారి సమ్మె మొదలైనవాటికి నాయకత్వం వహించింది సింగారవేలే. సంఘ సంస్కరణ, ఆత్మ గౌరవ పోరాటం, అంటరాని తనం రూపుమాపడం, కార్మికోద్యం నిర్మాణం మొదలైన మెట్లెక్కుతూ అంచలంచెలుగా సింగారవేలు 1925లో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరయ్యారు.

1920 నుంచి 1922 ఫిబ్రవరి దాకా గాంధీ నాయకత్వంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమంలో సింగారవేలు కీలక పాత్ర పోషించారు. 1921లో న్యాయవాద వృత్తిని వదిలేయడానికి చిహ్నంగా ఓ బహిరంగ సభలో తన నల్లకోటును దగ్ధం చేశారు. ఆ రకంగా సింగారవేలు గాంధీ నాయకత్వంలోని ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. వేల్స్ రాకుమారుడు భారత్‌లో పర్యటించినప్పుడు దానిని బహిష్కరించడానికి బంద్ చేయించారు. ఈ బంద్ సంపూర్ణంగా జరిగింది. గాంధీకి ఇది నచ్చలేదు. 1922లో గయలో కాంగ్రెస్ మహాసభలో ఆయన కార్మికవర్గ ప్రతినిధిగానే పాల్గొన్నారు.

1923 మే ఒకటవ తేదీన సింగారవేలు కిసాన్ పార్టీ ఆఫ్ హిందుస్థాన్ ఏర్పాటు చేశారు. ఆ రోజే మన దేశంలో మొట్టమొదటిసారి మద్రాసు హైకోర్టుకు ఎదురుగా ఉన్న బీచ్‌లో, ట్రిప్లికేన్ బీచ్‌లో అరుణ పతాకం రెపరెపలాడింది. దేశంలో మేడే జరుపుకోవడానికి ఇదే నాంది. 1923లో సింగారవేలు లేబర్ కిసాన్ గజెట్ పక్ష పత్రిక, తొహిలలార్ అనే తమిళ వారపత్రిక కూడా నిర్వహించారు. శింగారవేలు 1925లో మద్రాస్ కార్పొరేషన్‌కు ఎన్నికైనప్పుడు ఆయన ప్రోద్బలంవల్లే బడి పిల్లలకు మొట్టమొదటి సారి మధ్యాహ్న భోజనం మొదలైంది.

వాయువ్య రైల్వే, బెంగాల్-నాగపూర్ రైల్వే, ఈస్టిండియన్ రైల్వే కార్మికులు తమ పని పరిస్థితులు మెరుగుపడాలని సమ్మె చేశారు. ఆ సమయంలో ఉత్తరాదిలో పర్యటించి రైల్వే కార్మికులను సమీకరించడంలో ప్రధాన బాధ్యత సింగారవేలుదే.

1928లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మెలో సింగారవేలు ప్రత్యక్ష పాత్రధారి. ఈ సమ్మె సందర్భంగానే ఆయనకు పదేళ్ల జైలు శిక్ష పడింది. కానీ 18 నెలలకే విడుదలయ్యారు.

-ఆర్వీ

వెలలేని మాగాణి బిడ్డ

పులుపుల శివయ్య అంటే ఇప్పుడు గుర్తుపట్టే వారు తక్కువే కావచ్చు కానీ పలనాడు వెలలేని మాగాణిరా అన్న పాట చెవిన పడని పురోగమన వాదులు ఎవరూ ఉండరేమో! మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, వై.వి.కృష్ణారావు, వేములపల్లి శ్రీకృష్ణ, ఎల్.బి. గంగాధరరావు, టి.వెంకటేశ్వరరావు కమ్యూనిస్టుపార్టీ నేతలుగా రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎదిగారు. వీరందరికీ కమ్యూనిజం పాఠాలు నేర్పిన ధీశాలి పులుపుల శివయ్య (1910 నవంబర్ 14 - 1976 జూలై 14). పులుపుల వెంకటశివయ్య కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుడు. ఉత్తేజకరమైన పాటలను రాసిన రచయిత, యువజన, కార్మికోద్యమనేత.

నరసారావుపేట దగ్గర్లోని రొంపిచర్లలో జన్మించినా పౌరోహిత్యం చేసి జీవించే తండ్రి భవాన్ వినుకొండలో స్థిరపడ్డారు. అందుకని శివయ్య వినుకొండవాసిగానే ప్రసిద్ధులు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో గుర్రం జాషువా తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేశారు. బి.ఎస్.సి. చదవటానికి 1933లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వెళ్లారు. అక్కడ ఆరెస్సెస్ అగ్రనేత గోల్వాల్కర్తో పరిచయంతో ఆ శిబిరంలో చేరినా ఆ సంస్థ మత దురహంకారపూరిత వైఖరికి నిరసనగా వెంటనే బయటకు వచ్చారు. అప్పుడు అక్కడ ఉన్న ఆంధ్రవిద్యార్థులు పోలేపెద్ది నరసింహమూర్తి, చంద్ర రాజేశ్వరరావు, తుమ్మల వెంకటరామయ్య తదితరుల సాన్నిహిత్యంలో శివయ్య కమ్యూనిస్టు పలక మీద ఓనమాలు దిద్దుకున్నారు. 1934లో పరీక్షలు పూర్తిచేసుకుని కాశీ నుండి ఒక ట్రంకుపెట్టెనిండా కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చి కమ్యూనిస్టు స్రవంతిని ఆంధ్రలో ప్రవహింపజేశారు.

1935 ఏప్రిల్ 17న గుంటూరులో జరిగిన కమ్యూనిస్టుపార్టీ తొలి సమావేశంలో శివయ్య కమిటీ సభ్యునిగా ఎన్నికైనారు. పార్టీ మొదటి మహాసభల్లో పోలేపెద్ది రాష్ట్రపార్టీ కార్యదర్శిగా ఎన్నికవటంతో శివయ్య జిల్లాపార్టీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో పార్టీ కార్యకర్తలను పోషించటానికి, పార్టీని నిర్మించటానికి నందూరి ప్రసాదరావుతో కలిసి ఫ్రెండ్స్ హోమ్ భోజనశాల నడిపారు. అదేకాలంలో గుంటూరు పట్టణంలోను, జిల్లావ్యాపితంగా కూలీ రక్షణసంఘం, ప్రెస్ వర్కర్స్ యూనియన్, ముఠా కార్మికసంఘం, మున్సిపల్ కార్మికసంఘాలను నిర్మించి వారి హక్కులసాధనకై పాటుబడ్డారు. గుంటూరులోని కమ్మహాస్టల్‌ను కేంద్రంగా చేసుకొని బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి విద్యార్థులెందరినో కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దారు.

డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా 1937-38 సంవత్సరంలో ఏ.సి. కళాశాలలో నిర్వహించిన విద్యార్థి ఉద్యమంలో పరోక్షంగా ప్రధానపాత్ర వహించారు. రాష్ట్రవ్యాపితంగా పార్టీ నిర్మాణంకొరకు శివయ్య ఆంధ్రరాష్ట్రం మొత్తం విస్తృతంగా పర్యటించారు. 1937 ప్రారంభంలో జరిగిన తూర్పుగోదావరిజిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభలకు అధ్యక్షత వహించారు. 1938లో నెల్లూరువెళ్ళి అక్కడ ఎ.బి.ఎం. హైస్కూల్ విద్యార్థులచేత వారి హక్కులసాధనకోసం సమ్మెచేయించారు. రాష్ట్రంలో అంతకుముందు ఎక్కడా జరగనిరీతిలో రోమన్కాథలిక్ చర్చిలో పాటిస్తున్న కుల, మత భేదాలకు నిరసనగా సమ్మె నిర్వహించి చరిత్రసృష్టించిన సమరజీవి శివయ్య. 1937 కొత్తపట్నం, 1938లో, మంతెనవారిపాలెంలో జరిగిన కమ్యూనిస్టుపార్టీ వేసవి రాజకీయ పాఠశాలకు సిలబస్సు తయారుచేయటమేగాక ఆ పాఠశాలలకు ప్రిన్సిపాల్గా వ్యవహరించారు. ఈ పాఠశాలలో తయారైన అనేకమంది తరువాత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన భూమికను పోషించారు.

శివయ్య జాతీయోద్యమంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో జైలుశిక్షలకు గురైనారు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో 1943లో రహస్యజీవితం గడుపుతూ అరెస్టయ్యారు. 21 నెలల జైలు శిక్షను విధిస్తే శివయ్య బళ్ళారిలోని అల్లీపురం జైలుగోడలు బద్దలుకొట్టుకొని బయటకొచ్చారు. తరువాత తిరిగి ఆరు నెలల జైలుశిక్షను అనుభవించారు. శివయ్య కమ్యూనిస్టుపార్టీ గుంటూరుజిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా, ఆంధ్రరాష్ట్ర ఆర్గనైజర్గా పనిచేశారు.

వినుకొండ సీమ ప్రజల ఆదరాభిమానాలను పొందిన శివయ్య వినుకొండ మేజర్ పంచాయతీ అధ్యక్షునిగా 1952 నుండి రెండు పర్యాయాలు పనిచేశారు. 1952, 62 ఎన్నికలలో వినుకొండ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైనారు. విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ఉద్యమ సందర్భంగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రాచీనాంధ్ర, ఆంగ్ల సాహిత్యంలో మొదటినుంచీ అభినివేశంవున్న వ్యక్తి. శివయ్య కమ్యూనిస్టు ఉద్యమానికేగాక అభ్యుదయ సాహిత్యోద్యమానికి అందించిన సేవలు నిరుపమానమైనవి. అరసంలో శివయ్యది ఆదినుంచీ ప్రధాన పాత్ర. 1973లో గుంటూరులో జరిగిన అరసం ఆరవ రాష్ట్ర మహాసభలను ఉత్తేజకర ఉపన్యాసంతో ప్రారంభించారు. అరసం జిల్లాశాఖ అధ్యక్షునిగా, ఆఫ్రో ఆసియా రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా శివయ్యమృతి చెందే వరకూ కొనసాగారు.

శివయ్యరాసిన 'తెలుగు సాహిత్యంలో దేశభక్తి' వ్యాసంలో మధ్యయుగపు తెలుగుసాహిత్యానికి, శ్రీనాథునికి సంబంధించి పరిశోధకులు సైతం చేయనటువంటి అపూర్వ నిర్ధారణలు చేశారు.

1944లో వీరేశలింగం పంతులు రచనలను తెలుగువారికి చేరువచేసిన కార్యదక్షుడు శివయ్య. 1943లో కుందుర్తి, ఏల్చూరి, బెల్లంకొండ రామదాసు రాసిన తొలి అభ్యుదయ కవితా సంకలనం 'నయాగరా' ప్రచురించింది శివయ్యే. ఆ కవులకు మార్గదర్శకుడు శివయ్య. తన వ్యక్తిత్వంతో, మార్క్సిస్ట్ తాత్విక చింతనతో సృష్టించిన సాహిత్యంతో తెలుగునేలను ప్రభావితం చేసిన శివయ్య సోవియట్ యూనియన్లో పర్యటిస్తూ 1976 జూలై 14న మాస్కోలో వీరు మరణించారు.

- భరద్వాజ

చరిత్ర సృష్టించిన రైతు రక్షణ యాత్ర

ఆంధ్రరాష్ట్రంలో రైతు సంఘం 1928లో ఏర్పడింది. 1935 నాటికి అన్ని జిల్లాకు విస్తరించింది. 1934లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. దానితో అతివాద భావాల వ్యాప్తితో యువకులలో సోషలిస్టు ఆలోచన పెరిగింది. కృష్ణా, గుంటూరు, గోదావరి, నెల్లూరు జిల్లాలో కొందరు యువకులు కమ్యూనిస్టు పార్టీలో చేరడంతో రైతుసంఘం నిర్మాణం వేగం సంతరించుకుంది. 1936లో ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం నమోదు చేయడమైంది. 1937లో కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, చలసాని వాసుదేవరావులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. దీనితో రైతుసంఘం నిర్మాణ స్వరూపం సంతరించుకుంది. 1937 జనరల్ ఎన్నికల్లో జమిందారులు, పెద్ద పెద్ద భూస్వాములు జస్టిస్ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీ చేసినా కాంగ్రెస్ విజయం సాధించింది. కమ్యూనిస్టులు సైతం కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పోటీలో ఉన్నారు. దీనితో రైతుల్లో ఉత్సాహం పెల్లుబిక్కింది. 1937 మేలో కొత్తపట్నంలో జరిగిన రాజకీయ పాఠశాలను ప్రభుత్వం నిషేధించడం, లాఠీ చార్జీలు, అరెస్టులు చేసి కేసులు పెట్టడంతో రైతులలో పట్టుదల పెరిగింది.

జమిందారుల దౌర్జన్యాలు, ఆక్రమాలు, రైతులపై అధిక శిస్తులు విధింపు వంటి చర్యలు రైతులను ఆగ్రహానికి గురిచేశాయి. రైతులు రుణవిముక్తి కలిగించాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకున్నారు. ఈ దశలో రాష్ట్ర రైతుసంఘం 1937 జులై 3న ఇచ్ఛాపురం నుండి రైతు రక్షణ యాత్రను ప్రారంభించింది.. ఈ యాత్ర 1938 మార్చి 27న మద్రాసులో ముగిసింది. 1572 మైళ్లు కాలినడకన, 542 మైళ్లు బస్సుల ద్వారా ఈ యాత్ర సాగింది. 500గ్రామ సభలు, 60 ఫిర్కా, తాలూకా సభలు జరిగాయి.

4లక్షల 50వేల మంది రైతులు ఈ యాత్రలో పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా వేలాది పిటిషన్లు నాయకులకు వచ్చాయి. ఊరు ఊరునా ప్రజా వెల్లువ ఉప్పొంగింది. ఈ యాత్రకు రాష్ట్ర నాలుగు చెరగులా అపూర్వ స్వాగతం లభించింది. ఈ యాత్ర ఆంధ్ర రాష్ట్ర రైతాంగాన్ని మేలుకొల్పింది. జమిందారీ దురాగతాలపై పోరాడే స్ఫూర్తిని రగిలించింది. రైతుసంఘంలో సభ్యులు చేరిక పెరిగింది. దీనితో జమిందారీ విధానం రద్దు చేయాలని, మౌలిక వ్యవసాయం, సంస్కరణలు తీసుకురావాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. ఫ్యూడల్‌దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలనే చైతన్యం, ధైర్యం, ఆత్మవిశ్వాసం రైతాంగానికి ఈ యాత్ర కలిగించింది. యువ రైతులు అనేకమంది స్వచ్ఛందంగా ఈ యాత్రలో ఉత్సాహంగా పాల్గొని తరువాతకాలంలో రైతు సంఘం నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ సైతం రైతు రక్షణ యాత్రను వారి కోర్కెలను ఆమోదించింది. 1938 మార్చి 27న మద్రాసు చేరిన యాత్ర శాసనసభ స్పీకర్ బులుసు సాంబమూర్తికి ఒక నివేదికను సమర్పించింది.

స్వాతంత్ర్యోద్యమంలో దండి యాత్ర తరువాత అంతటి ప్రభావాన్ని రైతు రక్షణ యాత్ర కలిగించింది. ఆంధ్ర రాష్ట్ర రైతాంగ ఉద్యమంలో ఈ యాత్ర ఒక చారిత్రక పాత్రను నిర్వహించింది.

రైతు రక్షణ యాత్ర ప్రభావంతో మద్రాసు శాసనసభలో భూమిపై హక్కు రైతుదా? జమిందారుదా? శిస్తులను పెంచే హక్కు జమిందారుకు ఉన్నదా? అనే అంశాలను పేర్కొంటూ ఒక తీర్మానం ఆమోదించడమైంది. దీనితో ప్రకాశం గారి అధ్యక్షతన ఒక విచారణ కమిటీ ఏర్పాటు చేయడమైంది. ఈ కమిటీ 1938లో తన విచారణను ప్రారంభించి ఎన్నో సాక్ష్యాలను పరిశీలించి ఈ క్రింది రిపోర్టు ఇచ్చింది. జమిందారుకు భూమిపై హక్కులేదని, శిస్తువసూలు మాత్రమే చేసుకోవాలని కమిటీ చెప్పింది. రైతుల భూములను జప్తు చేసే అధికారంగానీ వేలం వేసే హక్కుగానీ జమిందారులకు లేదని చెప్పింది. సాముదాయక భూములపై రైతులదే హక్కని, పోరంబోకులు, కొండలు, అడవులు, అటవీసంపద పైన రైతులకు పూర్తి హక్కులు ఉన్నాయని కమిటీ చెప్పింది. కానీ జమిందారీ విధానం రద్దుచేయాలని మాత్ర ప్రకాశం కమిటీ చెప్పలేదు.

ఈ నేపథ్యంలో జమిందారులు పెద్దఎత్తున భూముల అమ్మకాలు ప్రారంభించారు. బకాయిల వసూలుకై రైతులపై వత్తిడి పెంచారు. జమిందారీ ప్రాంతాలలో రైతులు తమ హక్కుల సాధనకు సంఘటితమై పోరాటాలు చేయవలసి వచ్చింది. ఈ పోరాటాలకు ప్రధాన నాయకత్వం కమ్యూనిస్టులు వహించినా అతివాద కాంగ్రెసువాదులు, రంగా అనుచరలు కూడా ప్రధాన భూమిక వహించారు.

- చలసాని వెంకట రామారావు

రేణు చక్రవర్తి

అత్యధిక ఓట్లు సాధించిన మహిళ

కొందరికి బంధుత్వంవల్ల రాజకీయ పరిమళం అబ్బుతుంది. మరి కందరు సమాజ అనుశీలన, అవగాహన కారణంగా రాజకీయాల్లోకి వస్తారు. ఇంకొందరు ఎవరినో ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో చేరిపోతారు. ఆనువంశిక రాజకీయాలు ఈ మధ్య ఏహ్యభావం కలిగిస్తున్నా బంధుత్వం కూడా ఒక్కో సారి రాజకీయాల్లోకి వచ్చిన వారికి మేలే చేస్తుంది. రాజకీయాల్లో కమ్యూనిస్టు నాయకురాలు రేణు చక్రవర్తి (1917-1994) పాత్ర చాలా సానుకూలమైంది.

ఆమెను రాజకీయాల్లోకి ప్రోత్సహించింది 1948 నుంచి 1962 దాకా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్న డా. బి.సి.రాయ్. ఆయన రేణు చక్రవర్తికి బంధువు. 1938లో బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు రజనీ పామీ దత్ తో పరిచయం రాజకీయాల మీద ఆసక్తి మరింత పెంచింది. బ్రిటన్ లోనే ఆమె కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అదే సంవత్సరం స్వదేశం తిరిగి వచ్చిన తరవాత అప్పటికి నిషేధంలో ఉన్న సీపీఐలో సభ్యురాలయ్యారు. అక్కడి నుంచి వామపక్ష రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు.

దేశంలో కమ్యూనిస్టు, మహిళా ఉద్యమాలపై తనద్కైన ముద్ర వేసిన రేణు చక్రవర్తి పాత తరం కమ్యూనిస్టు యోధుల్లో ఒకరు. సమర్థవంతమైన నిర్వాహకురాలు. పార్లమెంట్లో ప్రజా సమస్యలపై గళం వినిపించిన పార్లమెంటేరియన్. ఉన్నత చదువుల కోసం కేంబ్రిడ్జికి వెళ్ళిన రేణుకు అక్కడ వామపక్ష భావజాలం పరిచయమైంది. 1938లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. "పిల్లలను కనడానికి, వంటింట్లో మగ్గడానికే మహిళలు" అన్న హిట్లర్ నినాదాన్ని ఆమె అసహ్యించుకున్నారు. సోషలిజంపై ప్రముఖ మార్క్సిస్టు మేధావి జాన్ స్ట్రాచె ఉపన్యాసాలకు ఆమె ఎంతో ఇష్టంగా హాజరై వినేవారు. ఇంగ్లండ్, ఐర్లాండ్లో బారతీయ విద్యార్థి సొసైటీల సమాఖ్య (ఎఫ్ఐఐఎస్)కి ఆమె వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా వున్నారు.

1939లో కేంబ్రిడ్జిలో ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ మొదటిసారిగా ఆమె గురించి విన్నారు. అప్పుడామె ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కాన్ఫరెన్సుకు ప్రతినిధిగా వచ్చారు. "అరుణ పతాకం తప్ప మరే పతాకం లేదు" అన్నది అప్పటి నినాదం. "నా దేశ విముక్తి కోసం పోరాడాలనే ఆలోచనలు ముప్పిరిగొంటుండగా నేను భారతదేశానికి తిరిగి వచ్చాను." అని రేణు రాసుకున్నారు. 1940 నుండి 47 వరకు కలకత్తా యూనివర్శిటీలో ఇంగ్లీషు లెక్చరర్గా ఆమె పనిచేశారు. అదే సమయంలో పార్టీ కార్యకలాపాలకు, ప్రజా ఉద్యమాలకు కూడా ఆమె సమయం కేటాయించేవారు. 1940 ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన ఎఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలకు ఆమె హాజరయ్యారు. అదే ఏడాది లక్నోలో మొదటిసారిగా విద్యార్థినుల మొదటి మహాసభ కూడా రేణు అధ్యక్షతన జరిగింది. ప్రముఖ కమ్యూనిస్టు మేథావి, జర్నలిస్టు నిఖిల్ చక్రవర్తితో ఇంగ్లండ్లో వుండగానే పరిచయం కాగా భారత్కు వచ్చిన తర్వాత వివాహం చేసుకున్నారు.

1948-51 మధ్య కాలంలో ఆమె అజ్ఞాతంలో వున్నారు. ఆ తర్వాత 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాల్గనాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. బసిర్హాట్ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసిన రేణు విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్ నుండి గెలిచిన ఏకైక మహిళా సభ్యురాలు ఆమె. 1962 బారక్‌పూర్ నుంచి పోటీ చేసి లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఓట్లు సంపాదించారు. 1958లోనే సీపీఐ జాతీయ సమితి సభ్యురాలిగా ఎన్నికైన ఆమె కార్మికోద్యమాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు.

1940-50ల మధ్య భారత మహిళా ఉద్యమం గురించి సమగ్ర చరిత్రను అందించేలా 'కమ్యూనిస్ట్స్ ఇన్ ఇండియన్ వుమెన్స్ మూవ్మెంట్" అనే పుస్తకాన్ని రాశారు. తీవ్ర అస్వస్థత కారణంగా ఆమెకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగినా ఆ తర్వాత కూడా ఆమె చురుకుగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గనేవారు. మెదడులో రక్త నాళాలు చిట్లడంతో 1994 ఏప్రిల్ 16న ఆమె కన్నుమూశారు.

నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో రేణూ చక్రవర్తి కార్మికోద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. అనేక సమ్మెలకు నాయకత్వం వహించారు. అనేక సార్లు జైలుకెళ్లారు. మహిళా ఉద్యమంలో ఆమె నిరుపమానమైన పాత్ర పోషించారు.

- లక్ష్మణ్ కుమార్

ప్రతి ఆదివారం గ్రామాల్లో తిరిగాం....

బాల్యంలో భిక్షున్నే. కష్టం చేస్తూ చదువుకున్నాను. ప్రతిది మా నాయనను ప్రశ్నించేవాన్ని. మోక్షానందస్వామి (గంగిరెడ్డి) ఆశ్రమంలో చదువుకునేవాన్ని. అనాథ వితంతువులపై సన్యాసి బలాత్కారాలు తెలిశాయి. ఆయన ఆధ్యాత్మికథలు జీవితంలో పనిచేయలేదు. మా పులివెందులలో కమ్యూనిస్టు దస్తగిరి పేదల పక్షం పనులు చూశాను. హింది సారు కొమ్మా శివశంకరరెడ్డింట్లో విశాలాంధ్ర చదివేవాన్ని. 17 వ ఏట నాస్తికున్నయ్యాను.

హైదరాబాదు ఉద్యోగంలో మా కార్మిక సంఘ స్థానిక నాయకుడు ఎం.ఎస్.రెడ్డి, జాతీయ నాయకులు ఎల్.ఎ.ప్రసాద్, ఓం ప్రకాశ్ గుప్తా నిరాడంబరతలను, ఉద్యోగుల కోసం వారి కార్యదీక్షను, నిబద్ధ శ్రమను గమనించాను. వారు కమ్యూనిస్టులు. గుంటూరులో కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు కీ.శే.ఎన్.ఆర్. శ్రీనివాసన్ నా రూమ్‌మేట్. శ్రీనివాసన్ ద్వారా 1977 లో పార్టీ సభ్యున్నయ్యాను.

అనంతపురం జిల్లా కదిరిలో నీలం రాజశేఖరరెడ్డి, ఐదుకళ్ళు సదాశివన్, వికె ఆదినారాయణరెడ్డి, పార్వతమ్మ, రామకృష్ణ, విశ్వేశ్వరరెడ్డి, దస్తగిరి, విద్యార్థి నాయకులు నరసింహులు, మనోహర్‌రెడ్డి మొదలగు వారితో పరిచయమయింది."కమ్యూనిస్టులకు పదవీ విరమణ లేదు. కాని శక్తి తగ్గినా పదవిలో కొనసాగరాదు. ద్వితీయ శ్రేణి నాయకులను తయారుచేయాలి. మనం నిర్విరామ ప్రజా జీవితం గడపాలి." శ్రమ సంస్కృతిలో విలువలు పాటించిన మహోన్నతులు రాజశేఖరరెడ్డి. చెప్పింది చేయడం ఆయన ఆశయం. కదిరిలో ఒక నక్సలైట్ పార్టీ జాతీయ నాయకులు అబ్దుల్ రవూఫ్ నివసించేవారు. రవూఫ్ పేరు ప్రతిష్ఠలున్న ప్రజా న్యాయవాది. పార్టీ కోసం వృత్తి వదిలేశారు. సమసమాజ సాధనకు తన మార్గంలో పోరాడిన నిబద్ధ నిరాడంబర కమ్యూనిస్టు ఆయన. ఒకసారి నీలం రవూఫ్‌ను కలవాలన్నారు. మనమే ఆయన దగ్గరికెళదామన్నారు. సాటి కమ్యూనిస్టు నాయకునికిచ్చిన గౌరవమది. విద్యుత్తులేని కొట్టంలో నేలపై కిరోసిన్ బుడ్డి వెలుగులో చదువుకుంటున్నారు రవూఫ్. అననుకూలతల్లోనూ ఆయన అధ్యయన నిబద్ధత అబ్బురం.

నీలం కార్యకర్తలను పట్టించుకునేవారు. కదిరి తాలూకా కార్యదర్శి రాయచోటి ఇస్మాయిల్‌ఖాన్ బీడీలు చుట్టి పొట్టపోసుకునేవారు. బీడీలు తాగేవారు. ప్రజా ప్రయోజకుల ఆరోగ్యం బాగుండాలి. సుదీర్ఘకాలం వారు సమాజ నిర్మాణానికి, మార్పు ప్రక్రియలకు ఉపయోగపడాలి. ఖాన్ ఊపిరితిత్తులు పాడయ్యాయి. ఆరోగ్యం పట్టించుకొమ్మని ఖాన్‌కు, అనంతపురంలో చూపించండని కదిరి కామ్రేడ్స్‌కు నీలం చెప్పారు. సదాశివన్, వి.కె.లు, ఇస్మాయిల్‌కు అనంతపురంలో చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. కమ్యూనిస్టు ఉద్దండులు నీలం, వి.కె., సదాశివన్‌లతో లభించిన కొద్ది పరిచయం నా కమ్యూనిస్టు నిబద్ధతను పెంచింది. నా సహచరిని కమ్యూనిస్టును చేసింది.

కదిరిలో నేను, పంచాయతిరాజ్ ఉద్యోగి రామాంజనేయులు పార్టీ శాఖనునిర్మించాము. ఎస్.ఎఫ్., వై.ఎఫ్.లను ప్రోత్సహించాము. బయప్ప, హనుమంతరెడ్డి, నాగరాజు (తిరుపతి) అలా తయారయినవారే. సినిమా కార్మిక సంఘాన్ని స్థాపించాము. జనతాపార్టీ నాయకుడు తుమ్మల మహమ్మద్ ఇలియాజ్ పార్టీలో చేరి నిబద్ధ కమ్యూనిస్టు నాయకునిగా మారారు. వివిధ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలతో కదిరి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఏర్పాటుచేసి వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేశాను. 60 విశాలాంధ్ర ప్రతులను తెప్పించి పంచేవాన్ని. క్లబ్బులు, గ్రంథాలయాలు, టీ కోట్లు, క్షౌరశాలలు, కార్మికవాడలు, విద్యాలయాల్లో పత్రికను తప్పక వేసేవాన్ని. విశాలాంధ్ర పాఠక సమావేశాలను ఏర్పాటు చేసేవాన్ని. ముఖ్యులం ప్రతిరోజూ సమావేశమై గత కార్యక్రమాలను సమీక్షించేవాళ్ళం. భవిష్యత్తు ప్రణాళికలను నిర్ణయించేవాళ్ళం. పుణెకు బదిలీ ఐంది. అక్కడ వృద్ధ నాయకురాలు కీ.శే.మాలతిబాయి పార్టీ కార్యకర్తలు సామాజిక రుగ్మతల పాలుకాకుండా జాగ్రత్త తీసుకునేవారు. డి.ఆర్.డి.ఎ. నుండి పదవీ విరమణ పొందిన గైక్వాడ్ జిల్లా కార్యదర్శిగా ఉండేవారు. మేము ఆదివారాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించేవాళ్ళం. పార్టీ సమావేశాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవాళ్ళం.

- సంగిరెడ్డి హనుమంతరెడ్డి

భారత వృద్ధిరేటు 7 శాతమే: ఫిచ్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ప్రముఖ రేటింగ్స్ సంస్థ ఫిచ్... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటు అంచనాను 7 శాతానికి తగ్గించింది. జూన్‌లో 7.8 శాతంగా ఉంటుందని అంచనా వేసిన ఫిచ్... తాజాగా దానిని సవరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాను కూడా తగ్గించింది. గతంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధిరేటు 7.4 శాతంగా ఉంటుందని అంచనా వేసిన ఫిచ్... తాజాగా దానిని 6.7 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితులు, అధిక ద్రవ్యోల్బణం, ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ అంచనాలను వెల్లడించినట్లు ఫిచ్ తెలిపింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి రేటును 18.5 శాతంగా గతంలో అంచనా వేసినప్పటికీ.. అది 13.5 శాతానికే పరిమితమైనట్లు గుర్తుచేసింది. ప్రపంచవ్యాప్తంగా 2022-23లో జీడీపీ 2.4 శాతంగా ఉంటుందని ఫిచ్ లెక్కగట్టింది. జూన్ అంచనాలతో పోలిస్తే 0.5 శాతం కోత విధించింది. వచ్చే ఏడాది వృద్ధి రేటులోనూ ఒక శాతం కోతపెట్టి 1.7 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. యూరో ప్రాంతం, యూకే ఈ ఏడాది చివరకు ఆర్థికమాంద్యంలోకి జారుకుంటాయని ఫిచ్ వెల్లడించింది. అమెరికా 2023 మధ్య నాటికి స్వల్ప మాంద్యంలోకి వెళ్తుందని చెప్పింది.

రాజస్థాన్‌లో మరో దారుణం
కుండలో నీరు తాగిన దళితుడిపై దాడి

జైసల్మేర్: పాఠశాలలోని కుండలోని నీరు తాగినందుకు ఆగ్రహించిన ఉపాధ్యాయుడు చేసిన దాడిలో మృతి చెందిన దళిత విద్యార్థి ఘటనను మరువకుండానే రాజస్థాన్‌లో అటువంటి మరో దారుణం చోటు చేసుకుంది. రాష్ట్రంలోని జైసల్మేర్ జిల్లాలో దిగ్గ గ్రామంలో అగ్రవర్ణాల వారి కోసం ఏర్పాటు చేసిన నీటి కుండలోని నీరు తాగిన దళితుడిపై కొందరు వ్యక్తులు ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. ఈ దారుణానికి సంబంధించి నలుగురు వ్యక్తులపై ఈ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన చతురరామ్ తన భార్యతో ఒక కిరాణా కొట్టు వద్దకు వెళ్లాడని, ఆ షాపు దగ్గర ఉన్న కుండలోని మంచినీళ్లు తాగడంతో ఆగ్రహం చెందిన కొందరు వారిని దుర్భాషలాడుతూ దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఈ దాడిలో చతరరామ్ తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకుని ఆసుపత్రిలో ఉన్న అతని నుంచి వాంగ్మూలం నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వ్యక్తులు తుపాకీని కూడా ఉపయోగించినట్టు బాధితుడు తెలిపారని చెప్పారు. అయితే ఈ విషయాన్ని ఇంకా ధృవీకరించలేదని పేర్కొన్నారు.

మహిళల రక్షణ పట్టని పాలకులు

- దోషులకు అండగా ప్రభుత్వాలు
- ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

విశాలాంధ్ర-విజయవాడ: మహిళా రక్షణ, భద్రత తమ కర్తవ్యం అంటూ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన ప్రభుత్వాలు తామిచ్చిన హామీలను తుంగలోకి తొక్కుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు దోషులకు నిలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యు) పిలుపులో భాగంగా గురువారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బాల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వం దోషులకు అండగా నిలవటాన్ని నిరసిస్తూ విజయవాడలో ధర్నా చేశారు. దాసరి భవన్ జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి దుర్గాభవాని మాట్లాడుతూ బాల్కిస్ బానో కేసులో దోషులు విడుదలై నెల రోజులైందని గుర్తు చేశారు. వారి విడుదలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా వివిధ సంస్థలు, పార్టీలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. గుజరాత్‌లో దోషులకు పూలదండలు వేసి సన్మానాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మహిళలకు రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని చెప్పారు. మహిళా సమాఖ్య విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో మహిళా సంక్షేమం కంటే స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ చర్యలు నేర ప్రవృత్తిని పెంచేలా చేస్తున్నాయని మండిపడ్డారు. బాల్కిస్ బానోకు న్యాయం జరగాలని, దోషులను తిరిగి జైలుకు పంపే వరకు తమ ఉద్యమం కొనసాగుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర నాయకులు తమ్మిన దుర్గ, డి.సీతారావమ్మ, దుర్గాసి రమణమ్మ, డి.పుష్ప, మూలి ఇందిర, లంక నాగమణి, చింతాడ పార్వతి, అండమాని నాగమణి, బీసు శాంతమ్మ, డివిజన్ కార్యదర్శులు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై
పంజాబ్-దిల్లీ ప్రభుత్వాల అంగీకారం

చండీగఢ్: పంట వ్యర్థాల దహనం అనంతరం వచ్చే కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు పంజాబ్-దిల్లీలోని ఆప్ ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. త్వరలో దీనిపై పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపాయి. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఐదు వేల ఎకరాల్లో బయో డీకంపోజర్‌ను పిచికారీ చేయనున్నట్లు గురువారం అధికారిక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై న్యూదిల్లీలో ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయని పంజాబ్ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి కుల్దీప్ సింగ్ ధాలివాల్ తెలిపారు. బుధవారం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పంట వ్యర్థాల దహనం వల్లే ఏర్పడే కాలుష్య నివారణపై ధాలివాల్ సమావేశమయ్యారు. అనంతరం దిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్‌తో చర్చలు జరిపారు. పైలట్ ప్రాజెక్టును రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. పంజాబ్ వ్యవసాయ మంత్రి ఈ ప్రక్రియలో, పంట అవశేషాలు మట్టిలో కలిసిపోయేటటువంటి పూసా బయో డికంపోజర్‌ను మొలకలపై పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. వరి కంకులు వల్ల కలిగే కాలుష్యాన్ని నివారించడానికి పంజాబ్ ప్రభుత్వం తగిన సన్నాహాలు చేసిందని ఆయన చెప్పారు. సబ్సిడీపై రైతులకు పరికరాలు అందజేస్తున్నామని, అన్ని జిల్లాల్లో అవగాహన, నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పంట వ్యర్థాలను కాల్చకుండా రైతులకు నగదు ప్రోత్సాహక ప్రతిపాదనను తిరస్కరించినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు ఎకరాకు రూ.2,500 ఇవ్వాలని ప్రతిపాదించిందని, ప్రతిపాదిత మొత్తంలో రూ.1,500 కేంద్రం భరించాలని సూచించారు. పంజాబ్‌లోని రూరల్ బెల్ట్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ, పంజాబ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కూడిన భారీ అవగాహన డ్రైవ్ ప్రారంభించనున్నట్టు ఆయన చెప్పారు.

ప్రధాని మోదీ ఉజ్బెక్ పయనం

న్యూఢిల్లీ: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్రసదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ గురువారం ఉజ్బెకిస్తాన్‌కు పయనమయ్యారు. ఉజ్బెక్ నగరం సమర్ కండ్‌కు బయలుదేరే ముందు ప్రధాని మాట్లాడుతూ... సమయోచిత ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై, అలాగే చర్చల సమయంలో కూటమి విస్తరణపై అభిప్రాయాలను పంచుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. 'ఉజ్బెక్ అధ్యక్షతన, ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక, పర్యాటక రంగాలలో పరస్పర సహకారం కోసం అనేక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది' అని ప్రధాని పేర్కొన్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో భేటీ కోసం కూడా తాను ఎదురు చూస్తున్నానని తెలి పారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదలైంది. శుక్రవారం జరిగే ప్రాంతీయ కూటమి వార్షిక శిఖరాగ్ర సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ తదితరులను మోదీ కలవనున్నారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ప్రధాని ఉజ్బెకిస్తాన్‌లో పర్యటిస్తున్నారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) అధ్యక్ష స్థానంలో ప్రస్తుతం ఉజ్బెకిస్తాన్ ఉంది.

పాదయాత్రకు అనుమతించరా?
చత్తీస్‌గఢ్ సర్కారుకు సీపీఐ ప్రశ్న

న్యూదిల్లీ: పాదయాత్రకు అనుమతిని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిరాకరించడంపై సీపీఐ తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వెలిబుచ్చింది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించింది. సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ చర్య పూర్తిగా అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ప్రజాస్వామ్య ఉద్యమాలను అణచివేయాలని చూస్తే అవి అప్రజాస్వామిక విధానాలకు దారితీస్తాయని పేర్కొంది. నిర్బంధ విధానాల అమలు అప్రజాస్వామికమే కాకుండా నియంత్రణా పద్ధతులు రాష్ట్ర ప్రగతి, అభివృద్ధికి ఆటంకాలుగా మారతా యని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. పాదయాత్రకు అనుమతించాలని పేర్కొంది. భారత్ జోడో పేరుతో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రదర్శనకు అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సీపీఐ యాత్రకు ఎందుకు అనుమతించ లేదని ప్రశ్నించలేదు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మనీశ్ కుంజం నాయకత్వంలో చత్తీస్‌గఢ్‌లో సీపీఐ పాదయాత్ర జరుగుతుంది.

ఈసీ అభిప్రాయంపై స్పష్టతివ్వండి
జార్ఖండ్ గవర్నర్‌తో సీఎం సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గురువారం ఆ రాష్ట్ర గవర్నర్ రమేశ్ బయిస్‌తో కలిశారు. తాను ఎమ్మెల్యేగా కొనసాగే విషయంలో స్పష్టతివ్వాలని కోరారు. ఇదే విషయంలో రాష్ట్రంలో మూడు వారాలుగా గందరగోళం నెలకొన్నట్లు గవర్నర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ అనిశ్చితిని తమకు అనుకూలంగా మలుచుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాల్లో ప్రతిపక్ష బీజేపీ ఉన్నదని, ఎమ్మెల్యేలను తమ గూటికి చేర్చుకునేందుకు కసరత్తు చేస్తోందని సోరెన్ చెప్పారు. 'ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రతిని అందజేయండి. సాధ్యమైనంత త్వరగా ఈ గందరగోళం తొలిగించండి. అనిశ్చిత పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం' అని గవర్నర్‌కు అందజేసిన లేఖలో సోరెన్ పేర్కొన్నారు. సోరెన్‌పై అనర్హత వేటు కోసం బీజేపీ అభ్యర్థించిన క్రమంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆగస్టు 25న నిర్ణయాన్ని రాష్ట్ర గవర్నర్‌కు తెలియజేసింది. ఈ పరిణామం రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితికి దారితీసింది. ఈసీ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనప్పటికీ ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి అనర్హుడని ఎన్నికల కమిషన్ పేర్కొన్నట్లుగా ప్రచారం జోరుగా సాగుతోంది.

'రక్షణ' స్వీయసమృద్ధి కీలకం: ఆర్మీ చీఫ్



నాగ్‌పూర్: రక్షణపరమైన సాంకేతికతల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతుండటంతో భారత్ వ్యూహాత్మకంగా బలహీనంగా అవుతోందని ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే అన్నారు. ఈ రంగంలో స్వీయ సమృద్ధి ఎంతో ముఖ్యమని చెప్పారు. దేశ భద్రతను అవుట్‌సోర్స్ చేయలేమని, ఇతరులపై ఎక్కువగా ఆధారపడలేమని ఆయనన్నారు. సరిహద్దు పరిస్థితుల క్రమంలో ఆధునిక, సాంకేతికపరమైన సాయుధ దళాలు అన్ని వేళలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను కలిగి ఉండటం కీలమని ఆర్మీ చీఫ్ అన్నారు. నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) 20వ స్నాతకోత్సవంలో విద్యార్థులనుద్దేశించి జనరల్ పాండే మాట్లాడారు. వివాదాస్పద సరిహద్దుల వారసత్వ సవాళ్లు- సైబర్, స్పేస్ విద్యుదయస్కాంత (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్) స్పెక్ట్రమ్ రంగాల్లో ముప్పులను ప్రస్తావించారు. గాల్వాన్ ఘర్షణతో సహా చైనాతో పంచుకునే సరిహద్దుల్లో పరిణామాల నేపథ్యంలో ఆధునిక, చురుకైన, సాంకేతిక సాధికారత కీలకమని చెప్పారు. ఇతర దేశాల సాంకేతికతలపై ఆధారపడకుండా రక్షణ రంగంలో స్వీయసమృద్ధి స్థాయికి భారత్ చేరుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు.

బీజేపీలో గోవా సీఎల్పీ విలీనం

పనాజీ: గోవా అధికార పార్టీ బీజేపీలోకి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ)ని విలీనం చేయడానికి అంగీకారం తెలిపినట్లు అసెంబ్లీ స్పీకర్ రమేశ్ తవాడ్కర్ తెలిపారు. 11 మంది సభ్యులున్న కాంగ్రెస్‌లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. సీఎల్పీని బీజేపీలోకి విలీనం చేయాలని కోరుతూ తనకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్పించిన లేఖను పరిశీలించానని స్పీకర్ తెలిపారు. విలీనానికి అవసరమైన సంఖ్యా బలం వారికి ఉందని పేర్కొన్నారు. ఈ తరుణంలో సీఎల్పీ విలీనానికి అంగీకరించినట్టు గురువారం విలేకరుల ముందు వెల్లడించారు. కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని అధికార బీజేపీలోకి విలీనం చేయాలని ఆ ఎనిమది మంది ఎమ్మెల్యేలు బుధవారమే తీర్మానం చేసిన విషయం విధితమే.

శ్రీవల్లీ చీరకు డిమాండ్

హైదరాబాద్: అల్లు అర్జున్, రశ్మిక మందన్న హీరో హీరోయిన్‌గా నటించిన సినిమా 'పుష్ప'. లెక్కల మాస్టారు సుకుమార్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. బాలీవుడ్‌లో రూ.100కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. 'పుష్ప'తో బన్నీ, రశ్మిక క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఈ చిత్రంలోని పాటలు భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా 'రా..రా..సామి' పాటకు అభిమానులు అందరు ఫిదా అయ్యారు. నెటిజన్స్ అప్పట్లో రీల్స్ చేసి హల్‌చల్ చేశారు. సినిమా విడుదలై తొమ్మిది నెలలైనా ఆ పాటకు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని అర్థమవుతోంది. ఆ పాటలో రష్మిక ధరించిన చీరకు ఇప్పటికి ఫుల్ డిమాండ్ ఉంది. ఈ చీరను కొనుగోలు చేయడానికి అభిమానులు ఆసక్తి చూపిస్తుండటం గమనార్హం. రశ్మిక మందన్న 'రా..రా..సామి' పాటలో ఎరుపు రంగు చీర ధరించి డ్యాన్స్ చేసింది. తన స్టెప్పులతో అభిమానులను ఫిదా చేసింది. ఈ చీరను కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో జైపూర్‌లోని ఓ షాపు శ్రీవల్లీ పాటలోని చీరకు దగ్గరి పోలికలున్న శారీని అమ్మకానికి పెట్టింది. అందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

'బ్రహ్మాస్త్ర' ఆఫర్ వచ్చింది... కానీ కుదరలేదు: సుధీర్

హైదరాబాద్: బ్రహ్మాస్త్ర సినిమా కలెక్షన్స్ మీద, సినిమా హిట్ అయిందా లేక పోయిందా అనే విషయంపై ఇంకా ఇండస్ట్రీలో వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ గోల ఇలా ఉంటే.. టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికర విషయం చెప్పాడు. అదేంటీ అంటే, 'బ్రహ్మాస్త్ర' సినిమా ఆఫర్ ముందు తనకి వచ్చిందట. కానీ ఆయన వదులుకున్నాడట. ఎందుకంటే.. సుధీర్ బాబు అప్పుడు తెలుగు సినిమాలతో బిజీగా ఉండటం వల్లే.. ఆ సినిమా ఆఫర్ వదులుకున్నాడట. సుధీర్ బాబు నటించిన 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతూ ఆయన ఈ విషయం వెల్లడించాడు. బాలీవుడ్ నుంచి ఆఫర్స్ వస్తున్నాయా? అంటే.. బ్రహ్మాస్త్ర ఆఫర్ వచ్చింది కానీ వదిలేసుకున్నా అని చెప్పాడు. అప్పుడు 'సమ్మోహనం' సినిమా ఉండటం, అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ చర్చల్లో కూడా ఉండటం కారణంగానే 'బ్రహ్మాస్త్ర' వదిలేసుకున్నానని చెప్పాడు. 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమా గురించి మాట్లాడుతూ.. ఇందులో ఆయన ఒక కమర్షియల్ సినిమా డైరెక్టర్ పాత్రలో కనిపిస్తానని చెప్పాడు. దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ఆ పాత్రని చాలా వైవిధ్యంగా డిజైన్ చేశాడని సుధీర్ బాబు చెప్పారు. ఈ సినిమాలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తోంది.

హోంవర్క్ చేసి రండి: తాప్సీ

ముంబై: దిల్లీ బ్యూటీ తాప్సీది ఫ్రెండ్లీ నేచర్. తన చుట్టూ ఉన్నవారితో ఈజీగా కలిసిపోతుందామె. ఏదైనా సమస్య వచ్చినా అలాగే పోరాడుతుంది కూడా. ఫ్రెండ్లీ నేచర్‌తోపాటు కోపం కూడా ఎక్కువే! తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె జర్నలిస్ట్‌పై మండిపడింది. ఆమె నటించిన 'దొబారా' సినిమా పరాజయం, విమర్శకుల గురించి ఓ జర్నలిస్ట్ ప్రశ్నించగా ఆమె కోప్పడింది. 'ఓ ప్రశ్న అడిగేటప్పుడు దానిపై కొంచమైనా అవగాహన ఉండాలి.. .. తెలుసుకొని అడగాలి.. కాస్త హోంవర్క్ చేసి రండి' అని కౌంటర్ ఇచ్చింది. 'ఏ సినిమాకు విమర్శలు లేకుండా ఉన్నాయి చెప్పండి' అని ఎదురు ప్రశ్నించింది. అయినప్పటికీ జర్నలిస్ట్ మరో ప్రశ్న సంధించారు. 'మొదట నా ప్రశ్నకు జవాబు ఇవ్వండి.. మీ ప్రశ్నకు నేను సమాధానమిస్తా'. సినీతారలకు నడవడిక తెలియదంటారు. సినీతారలతో ఎలా అంటే అలా మాట్లాడొచ్చా" అంటూ ఘాటుగా స్పందించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. తాప్సీ చేతిలో తమిళ, హిందీ భాషల్లో ఐదు చిత్రాలు సెట్స్ మీదున్నాయి.

ప్రభుత్వ చర్యలతో బియ్యం ధరలు తగ్గుముఖం!

న్యూఢిల్లీ: నూకల ఎగుమతిపై నిషేధం, ఉప్పుడు బియ్యం మినహా బాస్మతీయేతర బియ్యంపై 20శాతం మేర ఎగుమతి సుంకాన్ని విధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల స్థానిక సరఫరాలు మెరుగుపడి, దేశీయంగా రిటైల్ ధరలపై ఒత్తిడి తగ్గించగలదని సీనియర్ ప్రభుత్వ అధికారి గురువారం తెలిపారు. కాగా వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం... సెప్టెంబర్ 14 నాటికి బియ్యం టోకు విక్రయ ధరలు 10.7 శాతం మేర పెరిగి క్వింటాల్‌కు రూ.3,357.2 చేరాయి. ఏడాది క్రితం ఈ ధర క్వింటాల్‌కు రూ.3,047.32గా ఉంది. ఇదేవిధంగా రిటైల్ ధరలు 9.47 శాతం అంటే కిలోకు రూ.34.85 నుంచి రూ. 38.15కి పెరిగాయి. పశుగ్రాసం ధరలు కూడా పెరిగాయి. మొక్కజొన్న ధరలో పెరుగుదల కనిపించింది. జనవరి 01, 2022న కిలో రూ.19 ఉండగా, సెప్టెంబరు 8, 2022 నాటికి రూ.24కి చేరింది. ఇదే సమయంలో ఇక నూకల ధర కూడా కిలో రూ. 16 నుంచి రూ.22 కి చేరింది. ప్రభుత్వ గిడ్డంగుల్లో తగినంత నిల్వలు ఉన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో బియ్యం ఉత్పత్తి 6-7 మిలియన్ టన్నులు తగ్గే అవకాశం ఉన్నందున స్థానిక ధరలు ఒత్తిడికి గురైనట్లు మంత్రిత్వశాఖ వివరించింది. ఈ నేపథ్యంలో దిగుబడి తగ్గి నిల్వలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఫలితంగా దేశంలో ఆహార భద్రత దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే కేంద్రం ఆహారధాన్యాల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందన్న అభిప్రాయం నెలకొంది. ఇప్పటికే గోధుమ, దాని ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించిన కేంద్రం, బియ్యాన్ని కూడా ఆ జాబితాలో చేర్చింది. ఉప్పుడు బియ్యం తప్ప.. అన్ని బాస్మతీయేతర బియ్యంపై 20 శాతం మేర ఎగుమతి సుంకాన్ని విధిస్తూ కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం తర్వాత బియ్యం రిటైల్ ధరల్లో స్థిరీకరణ మొదలైందని, కొన్ని నగరాల్లో రేట్లలో స్వల్ప తగ్గుదల కనిపిస్తోందని ఆ అధికారి పీటీఐకి చెప్పారు.

పాక్ అంపైర్ అసద్ రవూఫ్ మృతి



ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ అంపైర్ అసద్ రవూఫ్ గురువారం అనుమానాస్పద రీతిలో గుండె పోటుతో కన్నుమూశారు. అంపైర్ మరణవార్త గురించి రవూఫ్ సోదరుడు తాహిర్ తెలిపాడు. లాహోర్‌లోని లాండా బజార్‌లో తన బట్టల దుకాణాన్ని మూసివేసిన తర్వాత ఇంటికి తిరిగి వస్తుండగా ఛాతీలో నొప్పితో అసద్ రవూఫ్ తీవ్ర ఇబ్బంది పడ్డాడని, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ.. అప్పటికే ప్రాణాలు కోల్పోయాడని తాహిర్ చెప్పాడు.

ఏడు సంవత్సరాల పాటు ఐసీసీ అంపైర్‌గా

అలీమ్ దార్ వంటి వారితో పాటు పాకిస్తాన్ తరపున ఇప్పటివరకు అంపైర్‌గా పని చేసిన లెజెండరీ అంపైర్‌లలో అసద్ రవూఫ్ ఒకరు. తిరిగి 2006లో రవూఫ్ ఐసీసీ ఎలైట్ ప్యానెల్ ఆఫ్ అంపైర్‌లలో చేర్చబడ్డాడు. ఆ తర్వాత అతను 47టెస్టులు, 98వన్డేలు, 23 టీ20లకు ఎలైట్ ప్యానెల్ ఐసీసీ అంపైర్‌గా పనిచేశాడు. 2013లో అతని పనితీరుపై వార్షిక సమీక్ష జరిగింది. కొన్ని అవకతవకలకు పాల్పడ్డాడని నిర్ధారించాక ఎలైట్ ప్యానెల్ ఆఫ్ అంపైర్ల నుంచి అతన్ని తొలగించారు. మొత్తంగా ఏడు సంవత్సరాల పాటు ఐసీసీ అంపైర్‌గా రవూఫ్ కొనసాగాడు. రవూఫ్ తన అంపైరింగ్ ప్రయాణాన్ని 1998లో ప్రారంభించాడు. 2000లో పాకిస్తాన్ వర్సెస్ శ్రీలంక మధ్య జరిగిన వన్డేల్లో తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్‌కు అంపైర్‌గా వ్యవహరించాడు. నాలుగు సంవత్సరాల తరువాత 2004లో రవూఫ్ తొలిసారిగా అంతర్జాతీయ అంపైర్ల ప్యానెల్‌లో చేర్చబడ్డాడు.

మంచి ఫస్ట్ క్లాస్ క్రికెటర్ కూడా..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కూడా రవూఫ్ అంపైర్ బాధ్యతలను నిర్వర్తించాడు. ఐపీఎల్ 2013 స్పాట్ ఫిక్సింగ్ విషయంలో అతని పేరు బహిర్గతమవ్వడంతో రవూఫ్ కెరీర్ పతనమైంది. ఇక ఆ తర్వాత అతను అంపైరింగ్ మానేయాల్సి వచ్చింది. ఇక తర్వాత లాహోర్‌లోని లాండా బజార్లో దస్తుల దుకాణాన్ని నడుపుతూ జీవితాన్ని వెళ్లదీస్తున్నాడు. రవూఫ్ సమర్థవంతమైన అంపైర్ మాత్రమే కాదు పాకిస్తాన్‌లో ప్రఖ్యాత ఫస్ట్-క్లాస్ క్రికెటర్ కూడా. అతను 71 ఫస్ట్ క్లాస్, 40 లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడాడు. అందులో రవూఫ్ మూడు సెంచరీలు, 26 హాఫ్ సెంచరీల సహాయంతో వరుసగా 3423, 611 పరుగులు చేశాడు. తన కెరీర్‌లో రవూఫ్ లాహోర్, నేషనల్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్, పాకిస్తాన్ రైల్వేస్, పాకిస్తాన్ యూనివర్సిటీ జట్లకు ఆడాడు.

మ్యాచ్ ఫిక్సింగ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నాడు

2013 ఐపీఎల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంలో రౌఫ్ కూరుకుపోయాడు. బుకీల నుంచి కాస్ట్లీ బహుమతులను స్వీకరించి అతను అవినీతికి పాల్పడినట్లు బీసీసీఐ డిసిప్లీనరీ కమిటీ నిర్ధారించింది. ఇక 2016లో రౌఫ్‌పై బీసీసీఐ ఐదేళ్ల పాటు నిషేధం విధించింది. ఈ విషయమై పాక్ టీవీ.టీవీతో అతను మాట్లాడుతూ.. 'నాకు మ్యాచ్ ఫిక్సింగ్‌కు ఎలాంటి సంబంధం లేదు. నేను ఐపీఎల్‌లో నా అత్యుత్తమ టైంను వెచ్చించాను. బీసీసీఐ నుంచి ఆరోపణలొచ్చాయి. వారంతట వారే నాపై నిషేధాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు' అని ఇటీవల అసద్ రవూఫ్ మీడియాతో తెలిపిన సంగతి తెలిసిందే.

హాట్‌కేకుల్లా భారత్-పాక్ మ్యాచ్ టికెట్లు

సిడ్నీ: టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాక్ మ్యాచ్ టికెట్లు మొత్తం హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వెల్లడించింది. చివరికి అదనపు స్టాండింగ్ రూం టికెట్లు కూడా నిమిషాల్లో అమ్ముడుపోయినట్లు పేర్కొంది. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీకి ఇప్పటి వరకు ఐదు లక్షల టికెట్లను విక్రయించినట్లు ఐసీసీ పేర్కొంది. ఈ టోర్నమెంట్ సూపర్ 12 దశలో అక్టోబర్ 23న భారత్-పాక్ తలపడనున్నాయి. 'ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్‌కప్ 2022 అన్ని వర్గాల అభిమానులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. ఇప్పటికే 5లక్షల మంది తమ సీట్లను రిజర్వు చేసుకొన్నారు. మొత్తం 82 దేశాల నుంచి అభిమానులు ఈ టోర్నమెంట్‌ను వీక్షించేందుకు హాజరుకానున్నారు. మొత్తం 16 జట్లకు చెందిన అత్యున్నత ఆటగాళ్లు దీనిలో పాల్గొననున్నారు. 2020 మహిళల ప్రపంచ కప్ తర్వాత తొలిసారి మైదానాల్లో పూర్తి సామర్థ్యం మేరకు అభిమానులను అనుమతిస్తున్నాం. ఎంసీజీ మైదానంలో జరిగే ఈ టోర్నమెంట్ ఫైనల్స్‌ను 86,174 మంది వీక్షించనున్నారు. అదే మైదానంలో అక్టోబర్ 23న భారత్-పాక్ మ్యాచ్ టికెట్లు, అడిషనల్ స్టాండింగ్ రూమ్ టికెట్లు మొత్తం నిమిషాల్లో అమ్ముడైపోయాయి. టోర్నీకి ముందు అధికారికంగా టికెట్ల రీసేల్ విక్రయ వేదికను ప్రారంభిస్తాం. అక్కడ అభిమానులు అసలు ధరకు టికెట్లను మార్చుకోవచ్చు" అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. అక్టోబర్ 22న జరిగే ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మ్యాచ్‌కు సంబంధించి కొన్ని టికెట్లు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిపింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.